RNI No.TELTEL/2016/68720

పోలీస్ నిఘా POLICE NIGAH తెలుగు దిన & మాస పత్రిక
పోలీస్ నిఘా POLICE NIGAH Web NEWS TV
రెండు తెలుగు రాష్ట్రాల్లో రిపోర్టర్స్ కావలెను
Contact : 9133613813

ప్రజలకోసం పోలీస్

# పోలీస్ నిఘా POLICE NIGAH

తెలుగు దినపత్రిక

Published from Rangareddy, (Circulated) by Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Sangareddy, Vikarabad, Medak, Siddipet, Karimnagar, Sirisilla(Vemulawada), Nizamabad, Warangal, Yadadri Bhonagiri, Nirmal, Adilabad

రంగారెడ్డి | సంపుటి : 10 సంచిక : 175 | ఎడిటర్: కేమోజు శ్రీనివాస్ | ఆదివారం 29-03-2026 | వెల: రూ.5/- | పేజీలు: 8




# ఆరు నూరైనా మూసీ పునరుజ్జీవం ఖాయం



## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
## మూసీ నదీ తీరాన ఓంకారేశ్వర ఆలయానికి సీఎం శంకుస్థాపన

హైదరాబాద్, మార్చి 28 (పోలీస్ నిఘా) : మూసీ నదీ తీరాన రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో మచిలేశ్వర స్వామి, ఓంకారేశ్వర స్వామి ఆలయాల సముదాయం పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, శంఖునాదాలు, గంటానాదాల మధ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక చారిత్రక మందిరాన్ని పునర్నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం.. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఇది జరుగుతున్నదని అనుకోవట్లేదు.. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అంటారు.. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం అని చెప్పారు. ఎనిమిది ఎకరాల్లో రూ.700 కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉందని, ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్ తరాలకు అందించాలన్నదే తమ ప్రభుత్వ ఆలోచన అని చెప్పారు. మూసీ నది పునరుజ్జీవానికి చాలామంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు.. ఆ అవకాశం తమకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడన్నారు. 'రాష్ట్ర పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే.. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది.. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగింది.. సముద్రపు ఒడ్డు లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటే.. మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా ఉపయోగించుకోలేదు.. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్యకారకంగా మారింది.. గొప్ప చరిత్ర కలిగిన హైదరాబాద్ చరిత్ర కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది.. ఢిల్లీ వంటి నగరాల్లో కాలుష్యంతో జన జీవనం స్తంభించిన పరిస్థితి.. అలాంటి నగరాల నుంచి మనం నేర్చుకోవాల్సిన అవసరం ఉంద'ని సీఎం రేవంత్ అన్నారు. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక అని, మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునర్నిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టామని, దీనిపై పెడర్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని వ్యాఖ్యానించారు. గోదావరి జలాలను తరలించి మూసీలో నిరంతరం నీరు పారేలా చర్యలు తీసుకుంటున్నామంటూ మూసీ కాలుష్యంతో నల్లగొండ జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారి కష్టాలు చూడలేని వారు రాయి కంటే కఠినాత్ములని విమర్శించారు. మానవ తప్పిదాలను సరిదిద్దకపోతే చరిత్ర మనల్ని క్షమించదన్నారు. మూసీ పరివాహక ప్రజాప్రతినిధులు మూసీ ప్రక్షాళన చెయ్యాల్సిందేనని రాజకీయాలకతీతంగా మద్దతిస్తున్నారు కానీ తాము చేయలేనిది ఎవరూ చేయొద్దనే అక్కసుతో కొందరు అడ్డుకోవాలని చూస్తున్నారని అన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆశీర్వాదంతో ఎన్నో పదవులు అనుభవించిన ఆ అక్క కొడుకు అభివృద్ధిని అడ్డుకోవడానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేశారన్నారు. ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకునే వారికి ప్రజా ప్రతినిధిగా ఉండే అర్హత ఉందా.. మా అక్కకు ఈ వేదికగా విజ్ఞప్తి చేస్తున్నా.. నీ పుత్రరత్నం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో వేసిన కేసును వెనక్కి తీసుకోండి.. లేకపోతే ప్రజలే మిమ్మల్ని సామాజిక బహిష్కరణ చేస్తారన్నారు. మీ వెనక ముసుగు తొడుక్కున్న వారికి కూడా చెబుతున్నా.. ఇలాగే వ్యవహరిస్తే ఇప్పుడున్న స్థానం కూడా వారికి ఉండదు.. ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ మొలిచినా ఈ ప్రాజెక్టు ఆగదు. ఇది శివ దీక్ష.. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం.. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు.. ఇది చరిత్రలో దేవుడు ఇచ్చిన గొప్ప అవకాశం.. ఇది ప్రజల పట్ల తమకున్న చిత్తశుద్ధి.. ప్రజలే తమకు దేవుళ్లు.. అంతిమంగా వారి ఆకాంక్షల మేరకే ముందుకు వెళతాం అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'తొలి ముద్ద' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 28 (పోలీస్ నిఘా) : దేశంలో ప్రస్తుతం ఆహారభద్రత ఉంది కానీ, పౌష్టికాహారం అందట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద 'తొలిముద్ద' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెడీ టూ కుక్ ఫుడ్ (ఉప్మా, కిచిడీ మిక్స్)ను బ్రేక్‌ఫాస్ట్‌గా అందించనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం వెనుక సహేతుక కారణం ఉందన్నారు. "బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుంది. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబసభ్యుల్లా భావిస్తోంది. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించే చర్యలు చేపట్టాం.




సమతులాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

## మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం



హైదరాబాద్, మార్చి 28 (పోలీస్ నిఘా) : తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి దాదాపు అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి మెట్రో రైలును నడిపించేందుకు సర్కారు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీన తీర్మానం ప్రవేశపెట్టారు. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మెట్రో నెట్వర్క్‌ను భారీగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఫేజ్-1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటం వల్ల చేపట్టబోయే ఫేజ్-2 పనులకు అనేక సాంకేతిక, చట్టపరమైన అడ్డంకులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని నిబంధనలను పరిష్కరించాలన్నా, మెట్రో విస్తరణ వేగంగా జరగాలన్నా మొత్తం నెట్వర్క్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి సభలో వివరించారు. అందుకే ఎల్ అండ్ టీ నుండి మెట్రో ఫేజ్-1ను 'హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్ ' ద్వారా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుందని వివరించారు.

## పోలీసు శాఖ సీఎం వద్దనే ఉండి కూడా ఇంత నిర్లక్ష్యమా?

### శాసనసభలో హరీష్‌రావు



హైదరాబాద్, మార్చి 28 (పోలీస్ నిఘా) : వడ్డించే వాడు మనవాడైతే లడ్డు ఎక్కడున్న వస్తుంది అంటరు కానీ పోలీసు శాఖ ముఖ్యమంత్రి వద్దనే ఉండి కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారు. పోలీసులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు నిరసించారు. రాత్రింబవళ్లు కష్టపడే వారు పోలీసులు.. ఈ రాష్ట్రం కోసం, సమాజం కోసం ఎంతో పని చేస్తున్నారన్నారు. కేసీఆర్ పోలీసులను ఎంతో గౌరవించారని, 40, 50వేల పోలీసు పోస్టులు భర్తీ చేశారని, కొత్త కమిషనరేట్లు ఏర్పాటు చేశారని, ఆరోగ్య భద్రత పథకాన్ని అమలు చేశారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వ హయాంలో ఏడు టీఏ బిల్లులు, మూడు సరెండర్ లీవులు, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నయన్నారు. పోలీసుల భద్రత పథకాన్ని రూ.లక్షకు మాత్రమే పరిమితం చేశారని, కొత్తగూడెం జిల్లాలో 72 టీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, కొన్ని జిల్లాల్లో ఇచ్చి కొన్ని జిల్లాల్లో పెండింగ్ పెట్టారని ఆక్షేపించారు. లక్షా 30వేల మంది పోలీసుల తరపున తాను మాట్లాడుతున్నానన్నారు. గత ఏడాదికంటే రూ.400 కోట్ల బడ్జెట్ ఎందుకు తగ్గించారని ప్రశ్నించారు. తమ ప్రశ్నలకు మంత్రినుంచి ఎలాంటి సమాధానం లేదని, పోలీసుల టీఏలు, డీఏలు, సరెండర్ లీవులు విడుదల చేయనందుకు, పోలీసుల ఆరోగ్య భద్రతా పథకంపై భరోసా ఇవ్వనందుకు, 17వేల ఖాళీల భర్తీపై చెప్పనందుకు, పోలీసులకు కొత్త వాహనాల విషయంలో సమాధానం చెప్పనందుకు, బీసీల ఆత్మగౌరవ విషయంలో స్పష్టత ఇవ్వనందుకు, బీసీ సబ్ ప్లాన్ నిదుల కేటాయింపుపై వైఖరి చెప్పనందుకు నిరసనగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ ఉద్యోగుల అపాయింటెడ్ డేట్ చెప్పనందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామన్నారు.

## బెట్టింగ్‌కు దూరంగా ఉండండి

### ఐపీఎల్ వేళ సజ్జనార్ హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 28 (పోలీస్ నిఘా) : ఐపీఎల్ క్రికెట్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో నగరంలో బెట్టింగ్ ముఠాల పట్ల హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, ఐపీఎస్ గారు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. క్రికెట్ క్రీడను జూదంగా మార్చి అమాయకుల జీవితాలతో ఆడుకునే వారిపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. గతంలో చేపట్టిన #SayNoToBettingApps ప్రచారానికి ప్రజల నుంచి అద్భుతమైన మద్దతు లభించిందని, తద్వారా కేంద్ర ప్రభుత్వం వందలాది బెట్టింగ్ యాప్‌లను నిషేధించడమే కాకుండా కఠినమైన ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును కూడా తీసుకువస్తోందని ఆయన గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఈ వంచన కొత్త రూపం దాల్చిందని, యాప్‌లు పోయినా టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల వేదికగా కొత్త వెబ్‌సైట్లను సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కేవలం ఆన్‌లైన్ మాత్రమే కాకుండా, నివాస గృహాలు, ఫామ్ హౌస్‌లు, ఇతర రహస్య స్థావరాల్లో గుంపులుగా చేరి ఫోన్ల ద్వారా ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. స్థానిక బుకీలు యువతను అప్పుల ఊబిలోకి నెడుతున్నారని, ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడానికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశ చివరికి కన్నీళ్లే మిగిలిస్తుందని, బెట్టింగ్‌లో గెలిచేది కేవలం నిర్వాహకులు మాత్రమేనని, ఆడే వారు సర్వస్వం కోల్పోతారని హెచ్చరించారు. ఒక్కసారి ఈ వ్యసనానికి బానిసలైతే కుటుంబాలు రోడ్డున పడతాయని, క్రికెట్‌ను ఒక క్రీడగా ఆస్వాదించాలి తప్ప జూదంగా మార్చుకోవద్దని హితవు పలికారు. నగరాన్ని, యువతను ఈ బెట్టింగ్ భూతం నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిస్తే లేదా మిమ్మల్ని వేధిస్తున్నా వెంటనే డయల్ 100కు గానీ, హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 16555 కు గానీ సమాచారం అందించాలని కోరారు.



## అంగరంగ వైభవంగా శ్రీరాముని పట్టాభిషేకం






భద్రాచలం, మార్చి 28 (పోలీస్ నిఘా) : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శనివారం నిర్వహించిన శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మిథిలా ప్రాంగణంలో జరిగిన ఈ దివ్య వేడుకలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. కళ్యాణ రాముడు 'రాజాధిరాజు'గా అభిషిక్తుడవడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికోత్సాహంతో నిండిపోయింది. ఉత్సవాలు భద్రుని మండపంలో స్వామివారి పాలకులకు అభిషేకంతో ప్రారంభమయ్యాయి. అనంతరం భజా భజంత్రీలు, సన్నాయి మేళాలు, కోలాట నృత్యాల నడుమ స్వామివారిని పల్లకిపై మిథిలా ప్రాంగణానికి ఘనంగా తీసుకువచ్చారు. శిల్పకళా శోభిత మండపంలో వేంచేయించి అర్చకులు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం నిర్వహించారు. తదుపరి పాదుకలు, రాజదండం, రాజముద్రిక, స్వర్ణ కిరీటం, ఖడ్గం, రత్నాభరణాలతో స్వామివారిని అంగరంగ వైభవంగా అలంకరించారు. ఈ ఆభరణాలను భక్తులకు దర్శనమిచ్చే సమయంలో భక్తులు భక్తి భావంలో మునిగిపోయారు. ఋగ్వేదం, సామవేదం, అథర్వణ వేదం, శుక్ల యజుర్వేదం పారాయణాలతో పాటు రామాయణం, విష్ణు పురాణం పఠనం నిర్వహించారు. పుష్కర నది జలాలతో మహాకుంభ తీర్థప్రోక్షణ చేసి భూమండలానికి శ్రీరాముడు రారాజుగా నిలవాలని సంకల్పం చేశారు. అనంతరం హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు. ఈ వేడుకలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల హాజరై స్వామివారిని దర్శించుకుని పట్టాభిషేకాన్ని తిలకించారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. గవర్నర్‌తో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు. 'శ్రీరామ జయరామ' నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. సంకీర్తనలు, వేదపారాయణాలు భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తాయి. కళ్యాణోత్సవం, పట్టాభిషేకం విజయవంతంగా ముగియడంతో భక్తులు తీపి జ్ఞాపకాలతో వెనుదిరిగారు.

## గ్యాస్ బుకింగ్ పేరిట జరిగే ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండండి



హైదరాబాద్, మార్చి 28 (పోలీస్ నిఘా) : ఇటీవల ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ బుకింగ్ పేరుతో ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు మరియు పౌర సరఫరాల శాఖతో పాటు ఫ్యూచర్ సిటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ సుధీర్ బాబు ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు. మీ ఫోన్‌కు వచ్చే ఓటీపీ, బ్యాంక్ పిన్ లేదా ఇతర వ్యక్తిగత వివరాలను గుర్తు తెలియని వ్యక్తులతో ఎప్పుడూ పంచుకోకండి. మీ గ్యాస్ కనెక్షన్ ఆగిపోతుంది, కెవైసీ అప్‌డేట్ చేయాలి అంటూ వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్‌ను నమ్మకండి. వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే తెలియని లింకులను క్లిక్ చేయవద్దు. గుర్తు తెలియని ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయకుండా ఉండండి. అనధికారిక లింకుల ద్వారా గ్యాస్ బుకింగ్ కోసం డబ్బులు చెల్లించవద్దు. గ్యాస్ సిలిండర్ బుకింగ్ కోసం కేవలం అధికారిక వెబ్‌సైట్లు లేదా అధికారిక మొబైల్ యాప్‌లను మాత్రమే ఉపయోగించండి. ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా మీ గ్యాస్ ఏజెన్సీని సంప్రదించండి. మీరు మోసాలకు బాధితులైతే లేదా అనుమానాస్పద కాల్స్ వచ్చినట్లయితే వెంటనే 1967 లేదా 100 నంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయండి.



# రోడ్ల పెండింగ్ పనులు పూర్తి చేయాలి

**రోడ్డు ప్రమాదాలను నివారించాలి**

**మత్తు పదార్థాలపై నిఘా పెంచాలి**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్, మార్చి 28 (పోలీస్ నిఘా) : రోడ్ల పై పెండింగ్ పనులు పూర్తి చేసి రోడ్డు ప్రమాదాలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో రోడ్ సేఫ్టీ, మత్తు పదార్థాల నిర్మూలనపై సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్క వాహనదారుడు సకాలంలో క్షేమంగా ఇంటికి చేరాలన్నారు. రోడ్ల పై పెండింగ్ లో ఉన్న సి సి కెమెరాలు సిగ్నల్స్ విద్యుత్ దీపాలు సైన్ బోర్డులు, గుంతలు పూడ్చి పెండింగ్ పనులు లేకుండా చూడాలన్నారు. విద్యాసంస్థల్లో, కళాశాలలో రోడ్డు భద్రత నియమాల గూర్చి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ద్విచక్ర వాహనదారులకు జరుగుతున్నందున వాహన దారులు నియమాలు పాటించడం, హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉ ఒడడం, రోడ్ల పై ఉన్న వివిధ సిగ్నల్, మార్కింగ్ గురించి తెలుసుకొని జాగ్రత్తగా ప్రయాణం చేయాలని సూచించారు. మత్తు పదార్థాలపై నిఘా పెంచాలన్నారు. మత్తుకు అలవాటు పడి యువకులు భవిష్యత్తు కోల్పోకుండా చూడాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలు నివారించవచ్చని, విద్యాలయాల్లో,మెడికల్ షాపుల్లో, పరిశ్రమలలో నిరతరం మత్తు పదార్థాలపై నిఘా పెట్టామన్నారు. మత్తు తో జీవితాలు చిత్తు అయిపోతాయన్నారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,జిల్లా వైద్య అధికారి శ్రీరామ్, డి ఎస్పీ లు, మున్సిపల్ కమిషనర్లు,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ పార్కులో స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభించిన

# టీజేఐఐసీ చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి








సంగారెడ్డి, మార్చి 28 (పోలీస్ నిఘా) : క్రీడాభివృద్ధిలో భాగంగా , స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ పార్క్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను శనివారం టీజేఐసీ చైర్మన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ మాధురి, సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజేఐసీ చైర్పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ... రాజీవ్ పార్క్ పక్కన ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడాభివృద్ధిలో భాగంగా సుమారు రూ. 20 లక్షల వ్యయంతో ఈ పూల్‌ను పునరుద్ధరించినట్లు తెలిపారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడానికి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడానికి ఇటువంటి సదుపాయాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సంగారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ చై కూన వనిత సంతోష్ మాట్లాడుతూ... సుమారు పది సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ స్విమ్మింగ్ పూల్ సరైన నిర్వహణ లేక నిరుపయోగంగా మారిందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పూల్‌ను మరమ్మతులు చేయించి తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. పట్టణ ప్రజలకు మెరుగైన క్రీడా వసతులు కల్పించడం తమ లక్ష్యమని, భవిష్యత్తులో మరిన్ని క్రీడా సదుపాయాలు అభివృద్ధి చేస్తామని తెలిపారు. యువజన సంక్షేమశాఖ మరియు స్పోర్ట్స్ అథారిటీ అధికారి అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ... పిల్లల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో స్విమ్మింగ్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈత ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తుందని పేర్కొన్నారు. స్విమ్మింగ్ పూల్‌ను పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంచుతూ నెలవారీ, మూడు నెలల, ఆరు నెలల కార్డుల రూపంలో రేట్లు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి వయస్సు వారికి అనుకూలంగా సమయాలను కూడా కేటాయించినట్లు వెల్లడించారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో సంగారెడ్డి ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా పిల్లలు, యువత పాల్గొనాలని అఖిలేష్ రెడ్డి కోరారు. స్విమ్మింగ్ ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు క్రీడా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, క్రీడా విభాగం సిబ్బంది, కౌన్సలర్స్ , ప్రజాప్రతినిధులు , క్రీడాభిమానులు ,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కొండమల్లేపల్లి గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో

# శ్రీరామనవమి నవరాత్రుల గాయత్రీ అనుస్థానం

**ఘనంగా గాయత్రీ యజ్ఞం,పూర్ణాహుతి**

**ఘనంగా దేవకన్యలకు పాదపూజ, సన్మానం**










దేవరకొండ , మార్చి 28 (పోలీస్ నిఘా) : అఖిల విశ్వ గాయత్రీ పరివార్ శాంతి కుంజ్ హరిద్వార్.... దక్షిణ భారత జోన్ ప్రతినిధి నరేంద్ర సింగ్ ఠాగూర్, సందీప్ భిషోయి ల నిర్దేశానుసారంగా కొండమల్లేపల్లి గాయత్రీ పరివార్ నిర్వాహకులు శ్రీరామనవమి నవరాత్రుల సందర్భంగ గాయత్రి అనుష్టానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రీ పరివార్ నిర్వాహకులు వింజమూరు చంద్రమౌళి, నూతనగంటిటి జగన్ లు మాట్లాడుతూ శ్రీరామనవమి నవరాత్రుల సందర్భంగా కొండమల్లేపల్లి గాయత్రీ ప్రజ్ఞాపిట్ లో గాయత్రి అనుష్టానం నిర్వహించడం జరిగింది అన్నారు. గాయత్రి అనుష్టానం అంటే గాయత్రీ మంత్రాన్ని నియమ నిబంధనలతో నిర్దిష్ట సంఖ్యలో జరిపే ఉన్నత శ్రేణి ఆధ్యాత్మిక సాధన అన్నారు.ఈ సాధన 9 రోజులపాటు త్రికాల సంధ్య వందనంతో సాధన చేస్తారని అన్నారు. రోజుకు 27 మాలల చొప్పున తొమ్మిది రోజులలో 24 వేల జపాలు ఈ అనుష్టానంలో చేయడం జరిగిందన్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం త్రికాల సంధ్యా సమయంలో జపం చేయాలన్నారు. పవిత్రమైన, ప్రశాంతమైన స్థలంలో కూర్చుని జపం చేయాలన్నారు. ఈ అనుష్టాన సాధన వలన సాధకులలో ఏకాగ్రత పెరుగుతుందని,బుద్ధి వికాసం జరుగుతుందని, జ్ఞానోదయం కలుగుతుందని, ముఖంలో తేజస్సు పెరుగుతుందని,ఆరోగ్య ప్రాప్తి కలుగుతుందని అన్నారు. ఈ అనుష్టానసాధనను పరివార్ లేదా గురువుల మార్గదర్శకత్వంలో చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. శ్రీరామనవమి నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజులు అనుస్థానాన్ని దిగ్విజయంగా పూర్తిచేసిన 8 మంది సాధకులు ఘనంగా గాయత్రీ యజ్ఞాన్ని,పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం 14 మంది దేవకన్యలకు పాదపూజ చేశారు. 12 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు కాళ్లు కడిగి, పాదాలకు పసుపు, గంధం, కుంకుమ తో అలంకరించి శాలువతో సత్కరించి పూలతో దీపాలతో ఆశీర్వదించారు. మంచి పుస్తకాలను బహుమతిగా అందించారు. చిన్న పిల్లలు దేవతలతో సమానం అని వారిని కొలుచుకుంటే దేవతలను కొలిచినట్టేనని అన్నారు. ఈ దీక్షలో కొంత భాగం అయినా నిత్యజీవితంలో కొనసాగించాలన్నారు. మాతా గాయత్రీ దేవి, పూజ్య గురుదేవులు శ్రీ వేదమూర్తి తపోనిష్ట యుగ దృష్ట పరమ పూజ్య పండిత శ్రీరామశర్మ ఆచార్య, వందనీయ మాత భగవతీదేవి శర్మ ల ఆశీర్వాదం ప్రజలపై ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. మనుషులందరూ దేవతా స్వరూపులేనని తమలో ఉన్న చెడు స్వభావాన్ని వదిలేయాలన్నారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.ఈ కార్యక్రమంలో నేలపట్ల వాసుదేవ్,నూతన గంటి లక్ష్మీ జగదీశ్వర్, నేలంటి వెంకటేశ్వర్లు, మారం వెంకటేశ్వర్లు, దోమకొండ మంజుల, విడియాల నాగమణి, ఏరుకొండ రాము, అలుగుబెల్లి నాగార్జున రెడ్డి, గాజుల అజిత కుశాల్,నడ్డి శంకర్, విజయలక్ష్మి, సరస్వతి, లలిత,మలికంటి అంజి, కారుణ్య ప్రవీణ్, శ్వేతా శివరాం, సత్యనారాయణ, బొడ్డుపల్లి ధనలక్ష్మి, మల్లికా,సాయినాథ్, దీపిక పాల్గొన్నారు.

# ప్రాణదాతలు '108' సిబ్బంది

## అత్యవసర సేవల్లో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలోనే నంబర్ వన్!



ఉమ్మడి అదిలాబాద్ , మార్చి 28 (పోలీస్ నిఘా) : పగలు, రాత్రి అనే తేడా లేకుండా.. ప్రమాదం జరిగినా, ప్రాణం మీదకు వచ్చినా, నిండు గర్భిణీకి పురిటి నొప్పులు వచ్చినా "మేమున్నాం.. మీకు ఏమీ కాదు" అంటూ భరోసానిచ్చే సంజీవని 108 అంబులెన్స్. నిరంతరం ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సిద్ధంగా ఉండే ఈ సేవలలో మంచిర్యాల జిల్లా గడిచిన మూడు నెలలుగా తెలంగాణ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి ఆదర్శంగా నిలుస్తోంది.

**అత్యధునాతన సాంకేతికత.. 30 సెకన్లలోనే స్పందన**

ప్రస్తుతం జిల్లాలో 18 అంబులెన్స్ వాహనాలు అందుబాటులో ఉండగా, వీటిలో 45 మంది పైలెట్లు, 44 మంది ఈఎంటి (ఇటు) లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ వాహనాలన్నీ పూర్తిగా ఆన్‌లైన్‌తో అనుసంధానం చేయబడ్డాయి.

త్వరితగతిన స్పందన: సమాచారం అందిన కేవలం 30 సెకన్లలోనే వాహనం ఘటనా స్థలానికి బయలుదేరుతుంది.

లైవ్ ట్రాకింగ్: బాధితులకు లేదా సమాచారం ఇచ్చిన వారికి వెంటనే ఒక మెసేజ్ అందుతుంది. అందులోని లింక్ ద్వారా అంబులెన్స్ ఎక్కడ ఉంది, ఎంత సమయంలో వస్తుంది అనే లైవ్ లొకేషన్‌ను ఫోన్‌లోనే చూసుకోవచ్చు.

గోల్డెన్ అవర్: ప్రమాదం జరిగిన మొదటి గంటను అత్యంత కీలకంగా భావించి, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించే లోపే వాహనంలోనే ప్రాథమిక చికిత్స అందిస్తూ ఎంతో మందిని మృత్యువు అంచున నుండి కాపాడుతున్నారు.

గత 11 నెలల సేవల గణాంకాలు (ఏప్రిల్ 2025 – ఫిబ్రవరి 2026)

జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సామ్రాట్ మరియు జిల్లా కోఆర్డినేటర్ కొండలరావు తెలిపిన వివరాల ప్రకారం, జిల్లాలో నమోదైన అత్యవసర కేసుల వివరాలు...

**గర్భిణీ కేసులు 3,634**
**శ్వాసకోశ సమస్యలు 1,664**
**గుండెపోటు కేసులు 1,440**
**గృహ ప్రమాదాలు 1,831**
**రోడ్డు ప్రమాదాలు 218**
**ఆత్మహత్య కేసులు 507**
**అగ్ని ప్రమాదాలు 49**
**ఇతర కేసులు 5,764**

మొత్తం కేసులు 22,308 సేవలో తరిస్తున్న సిబ్బంది జన్నారం 108 సిబ్బంది కిషన్, రమేష్, రఫీక్ మరియు గంగాధర్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి సకాలంలో వైద్యం అందించి, వారి ప్రాణాలను కాపాడడంలో తమకు ఎంతో తృప్తి మరియు సంతోషం కలుగుతోందని ఆనందం వ్యక్తం చేశారు. 24 గంటల పాటు అందుబాటులో ఉ ంటూ, నిబద్ధతతో పనిచేస్తున్న 108 సిబ్బందిని జిల్లా ప్రజలు అభినందిస్తున్నారు.

## ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**-ట్రాఫిక్ సిఐ కృష్ణ ఆధ్వర్యంలోయాదగిరిగుట్టలో అరైవ్ అలైవ్-**





యాదగిరిగుట్ట, మార్చి 28 (పోలీస్ నిఘా) : ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ట్రాఫిక్ సిఐ కృష్ణ అన్నారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలో అరైవ్ అలైవ్ ప్రోగ్రాం లో భాగంగా టూ వీలర్స్ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. ఫోర్ వీలర్స్ డ్రైవింగ్ చేసే సమయంలో తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని క్షేమంగా తిరిగి ఇంటికి వెళ్లాలని తెలియజేశారు. మీ మీద మీ కుటుంబం ఆధారపడి ఉంటుందని మర్చిపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, ట్రాఫిక్ సిబ్బంది సైదులు సలీం హనుమంతు విజయలక్ష్మి వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

# నాపై కోపంతో కక్ష సాధింపులు చేస్తున్నారు

**దైవ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రక్షధారణ దీక్ష ధారణ చేసిన తర్వాత జాత శౌచం ( మైలలు) ఉండవు**

**నాపై జాతా శౌచం ( పురుడు మైల ) ఆరోపణలు విమర్శల్లో ఎలాంటి వాస్తవం లేదు**

**ఆలయ ప్రధాన అర్చకులు స్థానాచార్యులు కాండూరి వెంకటాచార్యులు**



యాదగిరిగుట్ట, మార్చి 28 (పోలీస్ నిఘా) : కొందరు నాపై కోపంతో కక్ష సాధింపుగా ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారేమో అని అనుమానం వస్తుందని ఆలయ ప్రధాన అర్చకులు స్థానాచార్యులు కాండూరి వెంకటాచార్యులు అన్నారు. తాను పూర్తిగా శాస్త్రం, ధర్మం ప్రకారమే ముందుకు వెళుతున్నానని ఇటీవల జాతా శౌచం ( పురుడు మైల ) విషయంలో తనపై వస్తున్న విమర్శలు ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని యాదగిరిగుట్ట ఆలయ ప్రధాన అర్చకులు స్థానాచార్యులు కాండూరి వెంకటాచార్యులు స్పష్టం చేశారు. ఈ విషయంలో తాను ఎక్కడా శాస్త్ర విరుద్ధంగా ప్రవర్తించలేదని ఆగమ శాస్త్రం ప్రకారం ,నియమ నిబంధనలను అనుసరించే ముందుకు కొనసాగుతున్నానని అన్నారు. జాత శౌచం ( పురుడు మైల ) ఉన్నప్పటికీ ఇటీవల జరిగిన యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నానని తనపై ఆరోపణలు వస్తున్నాయని,ఇందులో ఎలాంటి వాస్తవం లేదని అన్నారు. ఎవరికైతే కుమారుడు జన్మించారో ఆ కుటుంబానికి మా కుటుంబానికి సుమారు మూడు నాలుగు తరాల దూరం ఉందని అన్నారు. ఒకే ఇంటిపేర్లు ఒకే రకమైన గోత్రాలు ఉన్నవాళ్లు ఒకే ఊరిలో నివాసం ఉంటున్నా కూడా జాతా శౌచం పాటించడం లేదని ఇందుకు అనేక ఉదాహరణలు యాదగిరిగుట్ట లోనే ఉన్నాయని తెలిపారు. కొన్ని కారణాలవల్ల తప్పనిసరి పరిస్థితుల వల్ల ఆ కుటుంబాల వాళ్లు అశౌచాల పట్టింపులు ఉండకూడదని ఒకరికొకరు నీళ్లు వదిలేస్తారని వివరించారు. అయితే తమకు పురుడు జరిగిన ఆ కుటుంబానికి నాలుగు తరాల దూరం ఉ ందని , వారితో ఉన్నటువంటి బంధాలు ఎప్పుడో తెగిపోయాయని ఆయన తెలిపారు. అదిగాక ఆ కుటుంబం వారు వందల కిలోమీటర్ల దూరంలో ఉంటారని చెప్పారు. కాబట్టి వారికి మాకు ఎలాంటి సంబంధం లేదని వారి ఇంట్లో పురుడు జరిగితే జాతా శౌచం తమకు వర్తించదని తెలిపారు. ఆ కుటుంబం వారు తమకు ఫోన్ ద్వారా గాని ప్రత్యక్షంగా గాని పురుడు జరిగిన విషయం తెలియజేయలేదని, బారసాలకు కూడా పిలవలేదని ఆయన స్పష్టం చేశారు. అటువంటప్పుడు తనకు జాతా శౌచం ఎలా ఉ ంటుందని ఆయన ప్రశ్నించారు. ఒక భక్తుడు అయిన యజమాని అయిన పూజారి అయిన దైవకార్యాన్ని ప్రారంభించినప్పుడు దీక్ష దారణ కంకణ దారణ చేసిన తర్వాత ఆ కార్యక్రమం పూర్తి అయ్యేవరకు ఎలాంటి అశౌచాలు వర్తించవని శాస్త్రమే చెబుతోందని అన్నారు. దైవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు రక్ష దారణ దీక్ష దారణ చేసిన తర్వాత ఆ కార్యక్రమం పూర్తయ్యే వరకు ఎలాంటి ఆటంకాలు, మైలలు ఉ ండవని ఇది శాస్త్రంలోనే చెబుతున్నారని తెలిపారు. అయితే తాను దేవస్థానం ప్రధాన అర్చకుడి హోదా లో ఇటీవల కాలంలో కొండపైన దేవస్థానంలో మతపరమైన , అర్చక సిబ్బందికి విధులు సక్రమంగా నిర్వహించాలని సూచిస్తున్నానని తెలిపారు. మతపరమైన , అర్చక సిబ్బంది క్రమశిక్షణ విధి నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తాను వారిని కాస్త గట్టిగానే నిలదీస్తున్నానని తెలిపారు. విధులకు గైర్హాజరు కాకుండా పూర్తిస్థాయిలో పనిచేయాలని తాను ఎప్పటికప్పుడు వారికి సూచిస్తున్నానని తెలిపారు. దీంతో కొందరు తనపై కోపంతో కక్ష సాధింపుగా ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారేమోనని అనుమానం వస్తుందని ఆయన ఆవేదన చెందారు. శాస్త్రం ధర్మం విధి నిర్వహణ విషయంలో తాను నిక్కచ్చిగా ఉండడమే కాకుండా మతపరమైన అర్చక సిబ్బందికి కూడా అలానే ఉండాలని సూచిస్తుంటానని చెప్పారు. తనపై వచ్చిన ఆరోపణల విషయంలో ఇప్పటికే తాను ఆలయ ఈవోకు అసలు ఏం జరిగింది ? శాస్త్ర ప్రకారంగా ఎలా ఉంటుంది ? అనే విషయాలను వివరించానని తెలిపారు. తాను పూర్తిగా శాస్త్ర ప్రకారమే నడుచుకున్నానని తెలిపారు.తనపై దుష్ప్రచారాలు, నిందలు, ఆరోపణలు వేయకుండా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని ఆయన అన్నారు. తాను సుమారు 21 సంవత్సరాల వయసులోనే ఉద్యోగంలో చేరానని, స్వామివారి సేవలో 43 సంవత్సరాలుగా కొనసాగుతున్నానని , పూర్తిగా నిష్ఠగా స్వామివారి సేవకు అంకితమై పనిచేస్తున్నానని అన్నారు. అలాంటి తాను ఎలాంటి చిన్న పొరపాటు, తప్పు కూడా చేయబోనని స్పష్టం చేశారు. తనపై దుష్ప్రచారాలు చేసేవారు ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించాలని అన్నారు. ఏది ఏమైనప్పటికీ తాను శాస్త్ర విరుద్ధంగా ఏమి చేయలేదని తాను పూర్తిగా ఆలయ సాంప్రదాయాల ప్రకారమే నడుచుకుంటున్నానని తెలిపారు.

# జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి కొరత లేదు: కలెక్టర్




రంగారెడ్డి, మార్చి 28 (పోలీస్ నిఘా) :జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ కు ఎలాంటి కొరత లేదు, ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ సమావేశ మందిరం నందు సివిల్ సప్లై అధికారులు, గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకుల నిర్వహకులతో జిల్లాలో గ్యాస్ పెట్రోల్, డీజిల్ సరఫరా, వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ సరఫరాకు ఎటువంటి కొరత లేదని, తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు అనవసర ఆందోళనకు గురికాకుండా, అవసరాన్ని బట్టి సమయానికి గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో గ్యాస్ వినియోగదారులు తరచుగా అవసరం లేకుండా బుకింగ్‌లు చేయడం వల్ల సరఫరా వ్యవస్థపై అనవసర ఒత్తిడి ఏర్పడుతుందని తెలిపారు. గ్యాస్ బుకింగ్ చేసిన తర్వాత, సంబంధిత ఏజెన్సీలు వినియోగదారుల ఇళ్ల వద్దకే సిలిండర్‌ను సరఫరా చేస్తాయని తెలిపారు. ఎవ్వరూ గ్యాస్ ఏజెన్సీలు లేదా గోదాముల వద్దకు స్వయంగా వెళ్లి వేచి ఉండవద్దని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం వినియోగదారుల తేదీ వచ్చినప్పుడు గ్యాస్ సిలిండర్‌ను తప్పనిసరిగా ఇంటి వద్దకే అందజేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు కొరత లేదని, ప్రజలు పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరి కొరత ఉన్నదని సమస్యలు సృష్టించకుండా, అధిక మోతాదులో తీసుకొని ఇండ్లలో నిల్వ చేసుకోవద్దని, దాని ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున ప్రజలు అవసరానికి మాత్రమే తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి, జిల్లా సివిల్ సప్లై అధికారి వనజాత, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ నిఘా

సంపాదకీయం | ఆదివారం | 29 మార్చి 2026

## భారత్-అమెరికా వాణిజ్యంలో అసమానతలు

భారత్ అమెరికా మధ్య 2022 నుండి 2025 వరకు వాణిజ్య సంబంధాలు గణనీయంగా విస్తరించాయి. అయితే ఈ విస్తరణ వెనుక ఒక ముఖ్యమైన ఆర్థిక వాస్తవం దాగి ఉంది. వాణిజ్య లోటు (ట్రేడ్ డెఫిసిట్). భారత్‌కు అమెరికాతో ఉన్న వాణిజ్యం పరిమాణంలో పెరుగుతున్నప్పటికీ, సమతుల్యత లోపం మాత్రం మరింత స్పష్టమవుతోంది. ఈ కాలంలో ఎగుమతులు, దిగుమతుల గణాంకాలు మాత్రమే కాకుండా, వాటి నిర్మాణం, విధానపరమైన మార్పులు, గ్లోబల్ రాజకీయాల ప్రభావం కూడా ఈ అసమానతను అర్థం చేసుకోవడానికి కీలకం. 2022 సంవత్సరంలో భారత్ నుండి అమెరికాకు జరిగిన ఎగుమతులు సుమారు 75 బిలియన్ డాలర్లకు చేరాయి. అదే సమయంలో అమెరికా నుండి భారత్‌కు దిగుమతులు సుమారు 50 బిలియన్ డాలర్ల వరకు నమోదయ్యాయి. అంటే భారత్‌కు సుమారు 25 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులు కనిపించింది. ఇది చూస్తే భారత్ కు లాభదాయకంగా అనిపించినా, ఈ లాభం కొన్ని ప్రత్యేక రంగాలపై అధికంగా ఆధారపడి ఉంది. ముఖ్యంగా ఐటి సేవలు, ఔషధాలు, వస్త్రాలు వంటి రంగాలు ప్రధాన పాత్ర పోషించాయి. 2023లో ఈ వాణిజ్య పరిమాణం మరింత పెరిగింది. భారత్ ఎగుమతులు 78 బిలియన్ డాలర్లకు చేరగా, అమెరికా దిగుమతులు భారత్ లోకి 55 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఈ ఏడాది కూడా భారత్‌కు సుమారు 23 బిలియన్ డాలర్ల మిగులు ఉంది. అయితే గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ కాలంలో అమెరికా భారత్‌కు ఎగుమతులు చేసే వస్తువుల విలువ పెరుగుతూ వచ్చింది. ముఖ్యంగా రక్షణ సామగ్రి, ఇంధన వనరులు, సాంకేతిక పరికరాలు వంటి రంగాల్లో అమెరికా ప్రభావం పెరిగింది. 2024 నాటికి ఈ వ్యాపారం మరింత వ్యూహాత్మకంగా మారింది. భారత్ నుండి అమెరికాకు ఎగుమతులు సుమారు 82 బిలియన్ డాలర్లకు చేరగా, అమెరికా నుండి భారత్‌కు దిగుమతులు 60 బిలియన్ డాలర్లకు పెరిగాయి. వాణిజ్య మిగులు సుమారు 22 బిలియన్ డాలర్లకు తగ్గింది. ఈ తగ్గుదల వెనుక ప్రధాన కారణం భారత్ అమెరికా నుండి పెరుగుతున్న ఇంధన దిగుమతులు, ముఖ్యంగా క్రూడాయిల్, ఎల్ఎన్‌జి (లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్). రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ప్రభావంతో గ్లోబల్ ఎనర్జీ మార్కెట్‌లో మార్పులు చోటుచేసుకోవడం దీనికి కారణం. 2025లో ఈ ధోరణి మరింత స్పష్టమైంది. భారత్ ఎగుమతులు సుమారు 85 బిలియన్ డాలర్లకు చేరగా, అమెరికా నుండి దిగుమతులు 65 బిలియన్ డాలర్లకు పెరిగాయి. వాణిజ్య మిగులు 20 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. అంటే నాలుగేళ్లలో భారత్‌కు ఉన్న వాణిజ్య లాభం క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఇది ఒక ఆందోళనకరమైన సంకేతంగా భావించాలి. ఈ గణాంకాలను పరిశీలిస్తే ఒక స్పష్టమైన ధోరణి కనిపిస్తుంది. భారత్ ఎగుమతులు స్థిరంగా పెరుగుతున్నప్పటికీ, అమెరికా నుండి దిగుమతులు మరింత వేగంగా పెరుగుతున్నాయి. దీని వెనుక ప్రధాన కారణం భారత ఆర్థిక వ్యవస్థలో ఉన్న నిర్మాణాత్మక బలహీనతలు. ముఖ్యంగా హైటెక్ తయారీ, అధునాతన రక్షణ ఉత్పత్తులు, ఇంధన స్వావలంబన లోపం వంటి అంశాలు భారత్‌ను అమెరికాపై ఆధారపడేలా చేస్తున్నాయి. విమర్శనాత్మకంగా చూస్తే ఈ వాణిజ్య సంబంధం సమాన భాగస్వామ్యం కంటే, ఆధారపడే సంబంధంగా మారుతున్నట్లు అనిపిస్తుంది. అమెరికా తన ఆర్థిక, సాంకేతిక ఆధిపత్యాన్ని ఉపయోగించి భారత్ మార్కెట్‌ను విస్తరిస్తోంది. మరోవైపు భారత్ తన సేవా రంగం ద్వారా మాత్రమే ప్రతిస్పందిస్తోంది. ఇది దీర్ఘకాలంలో ప్రమాదకరమైన అసమతుల్యతకు దారితీయవచ్చు. మరొక ముఖ్యమైన అంశం గ్లోబల్ రాజకీయాల ప్రభావం. అమెరికా, -చైనా వాణిజ్య యుద్ధం నేపథ్యంలో భారత్ ఒక ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా ఎదగడానికి ప్రయత్నిస్తోంది. కానీ అదే సమయంలో అమెరికా తన వ్యూహాత్మక ప్రయోజనాలకోసం భారత్‌ను వినియోగించుకుంటోంది. రక్షణ ఒప్పందాలు, ఇంధన సరఫరా ఒప్పందాలు ఈ దిశగా స్పష్టమైన ఉదాహరణలు. 2022 నుండి 2025 వరకు అమెరికా- భారత్ వాణిజ్య సంబంధాలు విస్తరించినప్పటికీ, సమతుల్యత లోపం ఒక ప్రధాన సమస్యగా నిలుస్తోంది. గణాంకాల ప్రకారం భారత్‌కు ఇంకా మిగులు ఉన్నప్పటికీ, అది క్రమంగా తగ్గుతూ ఉండటం ఆందోళన కలిగించే విషయం. దీన్ని సరిదిద్దాలంటే భారత్ తన తయారీ రంగాన్ని బలోపేతం చేయాలి. ఇంధన స్వావలంబన సాధించాలి, సాంకేతికతలో ముందడుగు వేయాలి. లేకపోతే ఈ వాణిజ్య సంబంధం ఏకపక్షంగా మారే ప్రమాదం ఉంది.

# బీఆర్ఎస్‌లో సెట్ అవుతారా?



తాటిపర్తి జీవన్ రెడ్డి..జగిత్యాల రాజకీయాల్లో తనదంటూ ముద్రవేసి సుమారు 42 ఏళ్ల పాటు కరీంనగర్ కాంగ్రెస్ కి కేరాఫ్ లా మారిన ఈ సీనియర్ నాయకుడు తాజాగా పార్టీతో ఉన్న అనుబంధాన్ని తెంచుకోవడం ఇపుడు తెలంగాణా రాజకీయాల్లో సెన్సేషన్ అయింది. ఇన్నాళ్ళుగా రాజీనామా చేస్తాడన్న వార్తల మధ్య ఎట్టకేలకి 2026 మార్చి 25న తన రాజీనామా అఫీషియల్ గా ప్రకటించారు. మొత్తానికి 42 ఏళ్ళుగా కాంగ్రెస్ తో తనకున్న బందానికి ముగింపు పలికిన జీవన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం ఒకసారి చూస్తే..

**26 ఏళ్ల వయసులోనే ఎన్టీఆర్ క్యాబినెట్‌లో**

1981లో రాజకీయాల్లోకి ప్రవేశించిన జీవన్ రెడ్డి మొదటగా ఇండిపెండెట్ అభ్యర్థిగా మలియాల పంచాయతీ సమితి ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఇక ఆ తర్వాత 1983లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరిన జీవన్ రెడ్డి ఆ పార్టీ ప్రభంజనంలో తొలిసారి జగిత్యాల నుండి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇక కేవలం 26 ఏళ్ల వయసులోనే ఎన్టీఆర్ క్యాబినెట్‌లో ఎక్సైజ్ శాఖ మంత్రిగా పనిచేసి రికార్డు సృష్టించడం ఇక్కడ విశేషం. అయితే తనని ఓటం ని చేసిన పార్టీని కాదని 1984లో నాదెండ్ల భాస్కర్ రావు ఎపిసోడ్ సమయంలో జీవన్ నాదెండ్లకు సపోర్ట్ చేయడం గమనార్హం.

**జగిత్యాల నుండి ఆయన మొత్తం ఆరుసార్లు**

ఇక ఆతర్వాత అంటే 1984 చివరలో కాంగ్రెస్ పార్టీలో చేరిన జీవన్ రెడ్డి అప్పటి నుండి నిన్న మొన్నటి వరకు కాంగ్రెస్ వాదిగానే కొనసాగారు. మొత్తంగా జగిత్యాల నియోజకవర్గం నుండి ఆయన మొత్తం ఆరుసార్లు (1983, 1989, 1996 ఉప ఎన్నిక, 1999, 2004, 2014) ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఇక వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 2006 నుండి 2009 వరకు రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించి జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు కూడా.

**కెసిఆర్ చరిష్మాని తట్టుకొని జగిత్యాల ఎమ్మెల్యేగా..**

అన్నింటికన్నా ముఖ్యంగా 2014 లో రాష్ట్రమంతా వీచిన బిఆర్ఎస్ ప్రభంజన0 లో హేమాహేమీలు గల్లంతు అయితే కెసిఆర్ చరిష్మాని తట్టుకొని మరీ జగిత్యాల నియోజక వర్గం నుంచి జీవన్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలవడం అప్పట్లో ఒక సంచలనం. ఇది ఒకరకంగా జీవన్ రెడ్డికి ప్రజల్లో ఉన్న మాస్ ఇమేజ్ కారణంగానే ఈ గెలుపు దక్కింది అన్నది పొలిటికల్ పండిట్స్ మాట. అయితే తన చేతిలో ఓడిన డాక్టర్ సంజయ్ చేతిలోనే తిరిగి 2018 లో జరిగిన ఎన్నికలలో జీవన్ రెడ్డి ఓడిపోవడంతో జగిత్యాల జిల్లా రాజకీయాలు రసవత్తరంగా మారాయ్. అయితే అప్పటి ఎఖీూ ప్రభుత్వమే అధికారంలో ఉండటం, జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉండటంతో సంజయ్, జీవన్ ల మధ్య ఆధిపత్య పోరు ఉన్నా అది పెద్దగా కనిపించలేదు.

**జిల్లా రాజకీయాల్లో ముసలం..**

ఇక మళ్ళీ 2019 లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్సీ అవడం జీవన్ రెడ్డి పొలిటికల్ కెరీర్ కి కాస్త మైలేజ్ ఇచ్చింది. తిరిగి 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మళ్ళీ బిఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కుమార్ చేతిలో రెండోసారి ఓడిపోవడం, గెలిచిన సంజయ్ కాంగ్రెస్ పార్టీకి దగ్గరవడంతో జిల్లా రాజకీయాల్లో ముసలం పుట్టించింది. దానికి తోడు 2024 లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో నిజామాబాద్ లోక్ స్థానంలో బిజెపి అభ్యర్థి ధర్మపురి అరవింద్ చేతిలో ఓడిపోడం కూడా జీవన్ రెడ్డి కి మాయని మచ్చనిలా మిగిలిపోయింది. ఒకరకంగా కెరీర్ లో జిల్లాలో గట్టి పట్టున్న నాయకుడిగా పేరున్న జీవన్ రెడ్డి వరుసగా అసెంబ్లీ ,పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమిని చవిచూడటంతో పార్టీలో కొంత పలుచన అయిన మాట వాస్తవం.

**జీవన్ రెడ్డి అసహనం పీక్స్**

దీనికి తోడు తన సొంత నియోజకవర్గంలో తన ప్రమేయం లేకుండా నిర్ణయాలు జరగడం, తనను పక్కన పెట్టి సంజయ్‌కి పెద్దపీట వేయడంతో జీర్ణించుకోలేకపోయారు. దీనికి తోడు, తన ప్రధాన అనుచరుడు గంగారెడ్డి హత్య జరిగిన సమయంలో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీసం పరామర్శించకపోవడం, ప్రభుత్వం నుండి సరైన రియాక్షన్ రాకపోవడంతో జీవన్ రెడ్డి అసహనం పీక్స్ చేరిపోయింది. వీటికి తోడు మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సంజయ్ తన వర్గీయులకే పెద్ద పీట వేయించుకోవడంతో ఇక ఎక్కువ కాలం ఇక్కడ ఇమడలేమన్న నిర్ణయానికి వచ్చేశారు. దీంతో జీవన్ రెడ్డి కాంగ్రెస్ కి రాజీనామా చేయబోతున్నాడన్న వార్తలు తెగ సర్కులేట్ అవడం తో ఆయన పార్టీ వీడకుండా ఇద్దరు క్యాబినెట్ మంత్రులు ,మరోపక్క పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ రాయబారాలు నడిపినా జీవన్ రెడ్డి అలకపాన్పు దిగలేదు. అయితే ఇక్కడ రేవంత్ చొరవ తీసుకొని మాట్లాడి ఉంటె రిజల్ట్ వేరేలా ఉండేదేమో.

**పక్కపార్టీలోకి పోతే అది కాంగ్రెస్‌కి దెబ్బ?**

ఇక ఇపుడు జీవన్ రెడ్డి ఏ పార్టీలోకి వెళ్తానేది బహిరంగంగా చెప్పకపోయినా బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్ళే సూచనలే ఎక్కువ. ఇక ఇన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీకి కరీంనగర్ జిల్లాలో కేరాఫ్ గా నిలిచిన జీవన్ రెడ్డి పక్కపార్టీలోకి పోతే అది కాంగ్రెస్ కి పెద్ద దెబ్బే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి నాయకత్వంపై మొదటిసారిగా ఒక సీనియర్ నాయకుడు తిరుగుబాటు చేసినట్టు అవుతుంది. ఇప్పటికే నివురు గప్పిన నిప్పులా ఉన్న మరికొంతమంది నేతలకి జీవన్ రెడ్డి దారి చూపించిన వారవుతారు కూడా. అయితే వరుసగా వచ్చిన ఏ ఎన్నిక అయినా భుజాల మీద వేసుకొని గెలిపించి హైకమాండ్ వద్ద పరుతిని పదింతలు చేసుకున్న రేవంత్ కి వ్యతిరేఖంగా ఇంకా రెండేళ్ళ పదవి కాలం ఉండగా గళం విప్పుతారా అంటే అనుమానమే. కాని అసమ్మతి గళం వినిపిస్తున్న కోమటి రెడ్డి లాంటి వాళ్ళకి ఈ సందర్భం ఒక ఆయుధం అవుతుందనడం లో సందేహం లేదు .

**బీఆర్ఎస్ పార్టీలో ఎక్కువ రోజులు ఇమడగలడా?**

అయితే జీవన్ రెడ్డి చేరాలనుకున్న బీఆర్ఎస్ పార్టీలో ఆయన ఎక్కువ రోజులు ఇమడగలడా అంటే పెద్ద క్వశ్చన్ మార్కే. ఎందుకంటే అక్కడ ఉండలేక బయటకొచ్చిన వాళ్ళు విజయ శాంతి నుండి ఈటెల దాకా బోలెడు. మరి ఆరుసార్లు ఎమ్మెల్యేగా , రెండుసార్లు క్యాబినెట్ మంత్రిగా , ఒకసారి ఎమ్మెల్సీగా గెలిచి ఇండిపెండెంట్ గా వ్యవహరించే జీవన్ రెడ్డి ఎలా ఉంటారో చూడాలి .

# గత పార్టీల చరిత్రను కవిత తిరగరాస్తుందా?

రాష్ట్రంలో మరో రాజకీయ పార్టీ పురుడు పోసుకోనున్నది. తెలంగాణ ప్రజా జాగృతి (టీపీజే) పేరుతో మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పార్టీని ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల సంఘం వద్ద రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు సైతం చేసుకున్నారు. త్వరలో ఎన్నికల సంఘం గుర్తింపు వస్తుందని అంచనా వేస్తున్నట్లుగా సమాచారం. ఈ నేపథ్యంలో హైదరాబాద్ శివారులో కవిత తన పార్టీ జెండా, ఎజెండాను ప్రకటించనున్నారు. రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర సమితిని ఏప్రిల్ 27న ప్రారంభించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పేరుతో, అదే ఏప్రిల్ నెలలో 27కు దగ్గర ఉండేలా 25న కవిత పార్టీని ప్రకటించనున్నారు. దీంతో కవిత పలు అంశాల్లో తన తండ్రి బాటలోనే పయనిస్తున్నట్లుగా రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడక ముందు, ఆ తరువాత అనేక పార్టీలు రాష్ట్రంలో పుట్టుకొచ్చాయి. అందులో కొన్ని కాలగర్భంలో కలిశాయి. కొన్ని మాత్రం నామమాత్రంగానే ఉన్నాయి. మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్ నవ తెలంగాణ, సినీ నటి విజయశాంతి తల్లి తెలంగాణ పార్టీ, మాజీ మంత్రి స్వర్గీయ పి.ఇంద్రారెడ్డి జై తెలంగాణ, తెలంగాణ ప్రజా సమితి పేరుతో భూపతి కృష్ణమూర్తి, తెలంగాణ సాధన సమితి పేరుతో ఆలే నరేంద్ర, ప్రజారాజ్యం పార్టీ పేరుతో చిరంజీవి, లోక్ సత్తా పార్టీని జయ ప్రకాశ్ నారాయణ, మన పార్టీ పేరుతో కాసాని జ్ఞానేశ్వర్,




తెలంగాణ జన సమితిని ప్రొఫెసర్ కోదండరామ్, తెలంగాణ విమోచన సమితి పేరుతో కపిలవాయి దిలీప్‌కుమార్, గాదె ఇన్నయ్య, వి.ప్రకాశ్‌లు ప్రారంభించారు. ఇలా అనేక పార్టీలు రాష్ట్రంలో స్థాపించినా అవి నిలవలేకపోయాయి. నామమాత్రంగా మారాయి. ఆ పార్టీలు స్థాపించిన సమయంలో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు వాటిని ఆదరించలేదు. దీంతో ఆ పార్టీలు చాలా వరకు కాలగర్భంలో కలిసిపోయాయి. తాజాగా కవిత పార్టీని కూడా ప్రజలు ఎంత వరకు ఆదరిస్తారనేది గమనార్హం.

**మూడు పార్టీలకు పోటీ ఇచ్చేనా..?**

కవిత స్థాపిస్తున్న పార్టీ ప్రాంతీయ పార్టీగా ఉండనుంది. ఇప్పటికే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రంలో బలంగా ఉన్నాయి. ఈ మూడు పార్టీలను కాదని టీపీజేను ప్రజలు ఎంత వరకు ఆదరిస్తారని ప్రశ్నార్థకం. ఎన్నకల సమయంలో ఏదైనా పార్టీతో పొత్తు పెట్టుకోక తప్పదా, తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో తన ప్రభావాన్ని టీపీజే చూపిస్తుందా? అనే సందేహాలను, అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ కూతురుగానే గుర్తింపు పొందిన కవిత, ఆయన వల్లే ఆమెను ఇన్నాళ్లు బీఆర్ఎస్ నాయకులు అభిమానిస్తూ, ఆదరిస్తూ వచ్చారు. కేసీఆర్‌కు దూరం అయ్యాక ఆమెను ఏ కోణంలో చూస్తారు? కుటుంబ కలహాల కారణంగా పుట్టుకొచ్చిన పార్టీగా చూస్తారా? లేక ప్రజా సమస్యల పరిష్కారానికి వచ్చిన పార్టీగా చూస్తారా? అనేది వేచి చూడాల్సిందే. మున్సిపల్ ఎన్నికల్లో సొంతంగా కాకపోయినా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పేరుతో పోటీ చేస్తున్నట్లుగా ప్రకటించినా ఫలితాలు సాధించలేకపోయారు. ఆమె సాధారణ ఎన్నికల్లోనే పోటీ చేస్తారా? లేక వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ, హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తారా? వాటి ఫలితాలు ఏ విధంగా ఉంటాయనేదిపై చర్చ జరుగుతోంది.

# యుద్ధ సవాళ్లను దీటుగా ఎదుర్కొంటున్నాం: మోదీ

నొయిడా, మార్చి 28 : పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎదురవుతోన్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని నొయిడాలో పూర్తయిన అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రపంచమంతా గమనిస్తోందని మోదీ అన్నారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందన్నారు. ఈ సంఘర్షణ కారణంగా.. ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడిందన్నారు. ప్రతి దేశం ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. దీనినుంచి దేశాన్ని



రక్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలు, రైతులపై యుద్ధ భారం పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఇక, ఇలాంటి సమయంలో ప్రజలు ఐక్యతతో ఉండాలని, ప్రశాంతతను పాటించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోన్న ఇంధన సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయంపై ప్రజలను భయాందోళనకు గురిచేసే తప్పుడు ప్రచారాలు చేయొద్దని రాజకీయ పార్టీలను కోరారు. తమ ప్రభుత్వ విధానాలు.. దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయన్నారు. నోయిడాలోని జేవర్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో రూ.11,200 కోట్లతో ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. అధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సాయంతో, 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయ రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గో-లాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌నూ నిర్మించారు.

# శాంతి కావాలంటే..మేం చెప్పినట్లు వినాలి

## గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక

టెహ్రాన్, మార్చి 28 : అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో ఇరాన్ కూడా గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తమ పొరుగు దేశాలకు హెచ్చరికలు చేశారు. గల్ఫ్ దేశాల్లో దాడులు ఆగాలన్నా.. శాంతి, అభివృద్ధి నెలకొనాలన్నా తాము చెప్పినట్లు వినాలన్నారు. ఆయా దేశాల గగనతలాలను వినియోగించుకొని శత్రువులు తమపై దాడి చేస్తున్నారన్నారు. తమ గగనతలాలను వినియోగించుకోవడానికి అమెరికా, ఇజ్రాయెల్‌లకు అనుమతి ఇవ్వొద్దని బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జోర్డాన్, ఇతర పశ్చిమాసియా దేశాలకు సూచించారు. తాము ఏ దేశంపైనా ముందస్తు దాడులు చేయబోమని అనేక సార్లు స్పష్టం చేసినట్లు పెజెష్కియాన్ పేర్కొన్నారు. కానీ తమ మౌలిక సదుపాయాలు, అణు, ఆర్థిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటే మాత్రం చూస్తూ ఊరుకోబోమని.. ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. శత్రు స్థావరాలు భూస్థాపితం అయ్యే వరకు దాడులు కొనసాగిస్తామన్నారు. శత్రువులకు సహకరించిన వారిని కూడా వదలబోమన్నారు.

**హర్మూజ్‌ను దాటిన మరో రెండు భారత నౌకలు**

భారత్ సహా తమ మిత్రులైన ఐదు దేశాల నౌకల కోసం హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఎల్పీజీని మోసుకొస్తున్న మరో రెండు భారత నౌకలు శనివారం హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు



వెల్లడించాయి. 90,000 టన్నులకు పైగా ఎల్‌పీజీ (వంటగ్యాస్)ని తీసుకువస్తున్న బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్ అనే రెండు నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయన్నాయి. మరో ఐదు భారతీయ ట్యాంకర్లు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సమీపంలోని జలాల్లో ఇరాన్ అనుమతి కోసం వేచి ఉన్నట్లు తెలుస్తోంది.

# తెలంగాణ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు ప్రారంభం




హైదరాబాద్, మార్చి 28 (పోలీస్ నిఘా) : ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. 'స్పోర్ట్స్, కల్చరల్ మీట్-2026' పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. లెమన్ అండ్ స్పూన్ పోటీలో మంత్రి కొండా సురేఖ మొదటి బహుమతి గెలుచుకోగా.. ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, రాగమయి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం రాజకీయాల్లో మునిగి తేలుతూ, నిరంతరం సమస్యల పరిష్కారం కోసం విరామం లేకుండా పని చేసేవారికి ఇది అద్భుత అవకాశం అన్నారు. ఇక్కడ అద్భుతంగా ఆడలేకపోవచ్చు గానీ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించేందుకు ఎల్బీ స్టేడియం వేదిక అవుతుందన్నారు. " ఈ మైదానంలో శిక్షణ పొందిన వారు మంత్రివర్గంలో ఉన్నారు. క్రికెట్‌లో దేశానికి వన్నె తెచ్చిన అజారుద్దీన్ మంత్రివర్గ సభ్యుడిగా ఉన్నారు. రంజీ క్రికెట్ ఆడిన వాకిటి శ్రీహరి క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారు. ఒకప్పుడు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కరవైంది. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చాం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహించాం. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చాం. దీనిపై ప్రతిపక్ష నాయకులు వివాదం సృష్టించే ప్రయత్నం చేశారు. మెస్సీ ఇక్కడికి వస్తే.. హైదరాబాద్ ఖ్యాతి ప్రపంచానికి తెలిసింది. ఎల్బీ స్టేడియం రాజకీయ కార్యకలాపాలకే పరిమితమైంది. దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియంను ప్రపంచ క్రీడా పోటీలు నిర్వహించేలా అభివృద్ధి చేయబో తున్నాం. బేగంపేట హాకీ క్రీడా మైదానాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. ఫుట్‌బాల్‌లో గతంలో దేశానికి మెడల్స్ తెచ్చిన వారిలో నలుగురు మన ప్రాంతానికి చెందినవారు న్నారు. మళ్లీ ఆ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలని సంకల్పించాం" అని అన్నారు.

## శ్రీ కృష్ణ పత్తి గోదాంలో అగ్ని ప్రమాదం



రంగారెడ్డి, మార్చి 28 (పోలీస్ నిఘా) : రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని శ్రీ కృష్ణ పత్తి గోదాంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ రోజు ఉదయం సుమారు 8 గంటల సమయంలో ఆకస్మికంగా మంటలు చెలరేగి, గోదాంలో నిల్వ ఉంచిన పత్తి అగ్నికి ఆహుతైంది. సంఘటన స్థలాన్ని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీ నారాయణ,సీఐ ప్రసాద్ పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై విచారణ జరుపుతున్నామని ఏసీపీ లక్ష్మీ నారాయణ తెలిపారు. వివరాల్లోకి వెళితే, సీసీఐ ధృవీకరించిన శ్రీ కృష్ణ పత్తి గోదాంలో మంటలు చెలరేగినట్లు వెల్లడించారు. గోదాం బయట నుంచి పొగ రావడం గమనించిన సిబ్బంది వెంటనే ఫైర్ ఇంజన్‌కు మరియు పోలీసులకు సమాచారం అందించారు. గోదాంలో విద్యుత్ సరఫరా లేదని, నిన్న రాత్రి పడిన ఉరుములు, వర్షాల ప్రభావంతో ప్రమాదం జరిగి ఉండవచ్చనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ లక్ష్మీ నారాయణ తెలిపారు.

## టెలిఫోన్ వెంకటయ్యను పరామర్శించిన బిఆర్ఎస్ యువ నాయకులు మురళీకృష్ణ





రంగారెడ్డి జిల్లా షాద్ నగర్, మార్చి 28 (పోలీస్ నిఘా) : షాద్ నగర్ పట్టణానికి చెందిన టెలిఫోన్ వెంకటయ్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా, బీఆర్ఎస్ యువనాయకులు మురళీకృష్ణ యాదవ్ ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అలాగే బీఆర్ఎస్ కార్యకర్త సుమదీర్ బబ్లూ తల్లి అనారోగ్యానికి గురికావడంతో, వారి నివాసానికి వెళ్లి ఆత్మీయంగా పరామర్శించారు.ఈ సందర్భంగా వీరందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, వారికి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజవరప్రసాద్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వేణుగోపాల్, నక్కల వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, అనిత రఘునాథ్ యాదవ్, వాణి పాండురంగారెడ్డి, గౌస్ జానీ, మహమ్మద్ ఎజాజ్ (అడ్డు), పిన్నమోని గోపాల్, ఎస్పీ శివ, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, నందకిషోర్, నాయకులు రవి యాదవ్, నందిగామ శ్రీనివాస్, రాజేందర్ సింగ్ తదితరులు ఉన్నారు.

## ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందజేయడమే కాంగ్రెస్ లక్ష్యం

### -వెల్ జర్ల గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్-



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ , మార్చి 28 (పోలీస్ నిఘా) : రాష్ట్రంలోని నిరుపేదలందరికీ సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్ జర్ల గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్ స్పష్టం చేశారు. శని వారం ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని వెల్జర్ల గ్రామంలో తుర్పటి లక్ష్మమ్మ ఇందిరమ్మ ఇల్లు కు శంకుస్థాపన చేశారు.ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని, అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు ఇచ్చి తీరుతామని భరోసా ఇచ్చారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని సర్పంచ్ ఆర్ బాబు నాయక్ వివరించారు. పేదవాడి కల నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నాను తెలిపారు. ఇందిరమ్మ ఇంటికి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు అందే విధంగా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదయ్య,ఉప సర్పంచ్ దొడల వెంకటేష్ యాదవ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జాంగారి రవి, కటికెల మంగమ్మ తిరుపతి యాదవ్ ,వార్డు సభ్యులు వెంకటయ్య, కావాలి లక్ష్మ య్య,తుప్పరీ రమేష్, తుప్పరి వనజ కుమార్, వడ్ల అనిత ఆచరీ, రవి నాయక్, ప్రవలిక మహేష్ యాదవ్ ,కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జాంగారి జంగయ్య, నేతలు కావాలి యాదయ్య, అనిమి బాలరాజు గౌడ్ ,కావాలి చిన్న నర్సింహులు,కెవి ఎం, తుప్పారి కుమార్,తూప్పరి రమేష్, తూర్పటి శ్రీశైలం, తుర్పటి మల్లేష్,తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ విజయ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు , మార్చి 28 (పోలీస్ నిఘా) : ఆలేరు శాఖ భజరంగ్ దల్ ఆధ్వర్యంలో శనివారం రోజు స్థానిక ఎమ్మెల్యే నివాసం దగ్గర వీర హనుమాన్ విజయ యాత్ర పోస్టర్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దల్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2 సాయంత్రం మన ఆలేరు మార్కండేయ దేవాలయం సిల్క్ నగర్ నుండి దుర్గామాత ఆలయం వరకు హనుమాన్ విజయ యాత్రను ఘనంగా నిర్వహించడం జరుగుతుంది కావున ప్రతి యొక్క హనుమంతుని భక్తులు ఈ హనుమంతుని విజయోత్సవ ర్యాలీ లో పాల్గొని విజయవంతం చేయగలరు అని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలేరు కాంగ్రెస్ నాయకులు బీజని భాస్కర్, సాయి,భజరంగ్ దల్ ఆలేరు కన్వీనర్ కొమ్ము శ్రవణ్, మైధం భాస్కర్, విద్యా ప్రముక్ వడ్డేమన్ శ్రీకాంత్, మొరిగడి వైకుంఠం, చింతకింది శ్రీదర్, అనిల్,శ్రీకాంత్, సురేష్, శివాజీ ఆనంద్ తదితరులు పాల్గొనారు.

# గవర్నర్ చేతుల మీదుగా 'గిరి మార్ట్' ప్రారంభం




భద్రాచలం, మార్చి 28 (పోలీస్ నిఘా) : గిరిజనుల ఆర్థికాభివృద్ధి, వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించాలనే లక్ష్యంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'గిరి మార్ట్'ను రాష్ట్ర గవర్నర్ సతీసమేతంగా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరి మార్ట్ లక్ష్యాలు, కార్యకలాపాలపై అధికారులు వివరించారు. అడవి ఉత్పత్తులు, సేంద్రీయ ఆహార పదార్థాలు, గిరిజన హస్తకళా వస్తువులను ఒకే వేదికపై అందుబాటులో ఉంచడం ద్వారా గిరిజనులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని తెలిపారు. మధ్యవర్తుల ప్రభావం తగ్గి, గిరిజనులకు నేరుగా లాభాలు చేకూరేలా ఈ మార్ట్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అలాగే స్థానికంగా తయారయ్యే అరుదైన ఉత్పత్తులకు గుర్తింపు తీసుకురావడంలో గిరి మార్ట్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రారంభోత్సవం అనంతరం గవర్నర్ సతీసమేతంగా గిరి మార్ట్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఉత్పత్తుల ప్రత్యేకతలు, తయారీ విధానం, మార్కెటింగ్ సదుపాయాలపై జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. గిరిజన మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రత్యేకంగా అభినందిస్తూ, స్వయం ఉపాధి అవకాశాలను మరింత విస్తరించాలని సూచించారు. ఇకపై గిరిజన ఉత్పత్తులను ఆన్‌లైన్ వేదికల ద్వారా కూడా విక్రయించేలా చర్యలు తీసుకోవాలని, దేశవ్యాప్తంగా మార్కెట్‌ను విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించాలని గవర్నర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,భద్రాచలం.ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట, శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, ఐటిడిఏ పీ.ఓ రాహుల్, సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చించోడులో మెగా హెల్త్ క్యాంప్ ప్రారంభం



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్, మార్చి 28 (పోలీస్ నిఘా) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చినీచోడు వైద్య అధికారిని డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా, స్పెషలిస్ట్ డాక్టర్ల మెగా వైద్య ఆరోగ్య క్యాంపును నిర్వహించడం జరిగింది. ఇట్టి మెగా హెల్త్ ఆరోగ్య క్యాంపును చించోడు సర్పంచ్ ర్యాకల శ్రీనివాస్ , డిప్యూటీ సర్పంచ్ రాజేందర్ రెడ్డి మరియు షాద్ నగర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి విజయలక్ష్మి చే ప్రారంభించబడింది. ఈ క్యాంపులో డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ,, మన ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు,ఈరోజు ఆరు మంది స్పెషలిస్ట్ వైద్య అధికారులు వచ్చారు. చించోడు గ్రామ ప్రజలందరూ కూడా ఓపికతో, సహనంతో మీకు ఉన్న సమస్యలు తెలియచేసి కన్సల్ట్ వైద్యాధికారితో పరీక్షలు చేయించుకుని, చికిత్స పొందగలరని తెలియజేశారు. తదుపరి చించోడు గ్రామ సర్పంచ్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ,, మన గ్రామంలో ఆరు మంది స్పెషలిస్ట్ వైద్యాధికారులతో మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయడం మన అందరికీ ఆనందదాయకము అని , ఇట్టి మెగా హెల్త్ క్యాంపు అవకాశాన్ని మన గ్రామ ప్రజలందరూ కూడా సద్వినియోగం చేసుకోవాలని, ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా వైద్యాధికారులతో సవినయంగా వివరించుకొని, మీకు కావాల్సిన పరీక్షలు అన్నీ కూడా ఉచితంగా చేస్తారు అని, మరి మీకు కావలసిన మందులు అన్ని కూడా ఇస్తారని తెలియజేశారు. ఈ క్యాంపు కొచ్చిన ప్రజలందరూ కూడా తొందరపాటు పడకుండా, నిదానంగా అందరూ పరీక్షలు చేయించుకోవాలని , అందరికి పరీక్షించిన తర్వాతనే ఈ వైద్య అధికారులు వెళ్తారని,అందరు తొందర పడవద్దు అని సర్పంచ్ ర్యాకాల శ్రీనివాస్ తెలియజేశారు. ఈ రోజు మెగా హెల్త్ క్యాంపులో దంత సమస్యలు ఉన్న 39 మందినీ, కంటి సమస్యలు ఉన్న 70 మందినీ, గైనిక్ సమస్యలు ఉన్న 47 మందినీ, ఎముకలకు సంబంధించిన 105 మందినీ, చిన్నపిల్లల ను 37 మందినీ, జనరల్ ఫిజీషియన్ చూసినవారు175 మందినీ, మొత్తం ఈరోజు 473 ఓ.పి.ని పరిశీలించారని డాక్టర్ స్రవంతి తెలియజేశారు.ఈ మెగా హెల్త్ క్యాప్ లో డాక్టర్ ప్రణీత గైనకాలజిస్ట్, డాక్టర్ స్మిత దంత వైద్యురాలు, డాక్టరు ఉమా ఆప్తాల్మిక్ వైద్యురాలు,డాక్టర్ అఖిల్ ఎముకల వైద్యుడు,డాక్టర్ పవన్ జనరల్ మెడిసిన్,ల్యాబ్ టెక్నీషియన్లు నవనీత మరియు అశోక్, చించోడు వైద్యాధికారి డాక్టర్ స్రవంతి,హెల్త్ ఎడ్యుకేటర్ జే. శ్రీనివాసులు,ఎం ఎల్ హెచ్ పి వైద్య అధికారులు డాక్టర్ సంధ్య, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ సత్యనారాయణ,డాక్టర్ కార్తిక్, డాక్టర్ జగదీష్, డాక్టర్ అహ్మద్, డాక్టర్ దినేష్, హెల్త్ సూపర్వైజర్లు శ్రీరామ, చంద్రకళ , ఫార్మసిస్టు ఉదయ్ కుమార్, స్టాఫ్ నర్స్ సువర్ణ, డీఈవో విజయ, చించోడు విలేజ్ సెక్రటరీ జయపాల్ రెడ్డి, చెవులపల్లి సర్పంచ్ జంగయ్య, దేవునిపల్లి డిప్యూటీ సర్పంచ్ మల్లేష్, చించోడు వార్డు మెంబర్లు శేఖర్, గిరిధర్ , వై. యాదగిరి, సంతోష్ , రామచందర్, ఎం. యాదగిరి, ఉమామహేశ్వర్, ఏఎన్ఎంలు మరియు ఆశలు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ కాలనీలో ఘనంగా శ్రీ సీతారామ కల్యాణ వేడుకలు



మేడ్చల్, మార్చి 28 (పోలీస్ నిఘా) : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ జర్నలిస్ట్ కాలనీ శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు, కళ్యాణ మహోత్సవానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి, కొలను రాజశేఖర్ రెడ్డి, సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు దేవాలయ ప్రాంగణంలో జర్నలిస్ట్ కాలనీ ఫౌండర్ మారుతి సాగర్ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు గోవిందరావు,వనిత దంపతులు, కాలనీ ఉపాధ్యక్షుడు ముక్క దేవేందర్ గుప్తా అనురాధ, మల్లికార్జున్,సువర్ణ దంపతులు స్వామివారి కళ్యాణం పూజలు నిర్వహించారు. దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు కృష్ణరావు , భవ్య టీవీ ఎండీ కే వి వి సత్యనారాయణ, రమేష్, మహేష్, లక్ష్మన్ , రాముయాదవ్,బంటి మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు. భక్తులు అన్నదానానికి, వస్తు మరియు ధన రూపేనా అందించిన వారిలో నిజాంపేట్ మున్సిపల్ మాజీ కార్పొరేటర్ మీనా సునీల్ రెడ్డి, ఆస్కాని మారుతి సాగర్, కూనభరత్ గౌడ్, టేకుల సుధాకర్ రెడ్డి, ముక్కర్ల లాలయ్య, కొలను జనార్దన్ రెడ్డి, తలారి వీరేష్ ముదిరాజ్, రవికుమార్. దాల్ నాయుడు, మిశ్రా, సురేష్, జీవన్ రోషన్, కొండ వెంకటేష్, తమ వంతు సహాయ సహకారాలు అందజేసి స్వామివారి పూజలో పాల్గొన్నారు

అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు, కాలనీ వాసులుతో పాటు చుట్టుపక్కల ప్రజలు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్టలో ఆధునిక ఫిజియోథెరపీ కేంద్రానికి శ్రీకారం

### -విప్ బీర్ల అయిలయ్య చేతుల మీదుగా ప్రారంభం-



యాదగిరిగుట్ట, మార్చి 28 (పోలీస్ నిఘా) : యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట పట్టణం శ్రీరాంనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రిలీఫ్ ఫిజియో రెహబ్ ఫిజియోథెరపీ కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శనివారం ఘనంగా ప్రారంభించారు.కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గారు రిబ్బన్ కట్ చేసి కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కేంద్రాన్ని పరిశీలించి అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోకి రావడం ఆనందదాయకమని తెలిపారు.ప్రమాదాల వల్ల గాయాలు, వృద్ధాప్య సమస్యలు, కండరాల నొప్పులు, శస్త్రచికిత్సల అనంతరం పునరుద్ధరణ చికిత్సలకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.ఆధునిక వైద్య సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ప్రాంతీయ ప్రజలకు ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఇలాంటి నూతన వైద్య సేవలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యే కి అభినందనలు తెలిపారు.

## తేనెటీగల పెంపకంతో యువత ఆర్థికంగా ఎదగాలి: ఐటీడీఏ పీవో బి. రాహుల్



భద్రాచలం, మార్చి 28 (పోలీస్ నిఘా) : తేనెటీగల పెంపకంపై శిక్షణ పొందిన యువతీ యువకులు మార్కెట్ అవకాశాలను వినియోగించుకొని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచించారు. శనివారం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో ఐదు రోజులపాటు నిర్వహించిన హనీ బీ (తేనెటీగల) పెంపక శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజన గ్రామాలలో సేకరించే తేనెకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నదని, దీనిని దృష్టిలో ఉంచుకొని శిక్షణ పొందిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. శిక్షణలో తేనెటీగల ప్రాముఖ్యత, తేనె ఉత్పత్తి విధానం, వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్ పద్ధతులు, వాట్సాప్ మరియు ఆన్‌లైన్ ద్వారా విక్రయ విధానాలు, తేనెటీగల కాలనీల నిర్వహణ, సీజనల్ జాగ్రత్తలు, తేనె సేకరణ విధానం, బీ బాక్సుల నిర్వహణ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించబడిందని తెలిపారు. ఈ పరిజ్ఞానాన్ని తక్షణమే ఆచరణలో పెట్టి తేనెటీగల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందాలని ఆయన సూచించారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు మరియు హనీ బీ బాక్సులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణతో పాటు యువతీ యువకులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్లు పనులను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్ పర్సన్



దేవరకొండ , మార్చి 28 (పోలీస్ నిఘా) : దేవరకొండ పట్టణంలోని 20 వార్డులో సిసి రోడ్లు గత రెండు రోజుల నుంచి వేగంగా జరుగుతున్నాయి. ప్రధానంగా వార్డులోని ఐబి వెనకాల స్వర్ణకార వీధి వెంట ఇరువైపులా రోడ్లను చేపట్టడం జరిగిందని మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు మరో రెండు మూడు రోజులలో పనులు పూర్తి చేయనున్నట్లు రోడ్లను నాణ్యతతో వేయడం జరుగుతుంది. వారి వెంట మున్సిపల్ ఏఈ రాజు సిబ్బందిలు ఉన్నారు.

## పంపుల లోపంతో మూడు రోజుల పాటు మిషన్ భగీరథ నీళ్లు నిలిపివేత




దేవరకొండ , మార్చి 28 (పోలీస్ నిఘా) : నాంపల్లి మండలం బట్లపల్లి (ఎస్‌డబ్ల్యూ లింగోటం) పంప్ హౌస్‌లోని 440 స్థాయి పంపుల బేరింగ్‌లు విరిగిపోవడంతో మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో మూడు రోజుల పాటు మిషన్ భగీరథ నీళ్లు నిలిచిపోనున్నాయి.దీంతో దేవరకొండ నియోజకవర్గం పరిధిలో మిషన్ భగీరథ నీళ్లు అందుకునే మండలాలకు అంతరాయం కలగనుంది. ముఖ్యంగా చింతపల్లి, కొండమల్లేపల్లి, దేవరకొండ, గుండ్లపల్లి, చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లో ప్రభావం కనిపించనుంది. ఈ కాలంలో త్రాగునీటి కొరత తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని సర్పంచులు ప్రతి గ్రామ పంచాయతీలో ముందుగానే త్రాగునీటి నిల్వలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.ప్రజలు నీటిని జాగ్రత్తగా వినియోగిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ విషయాన్ని మల్లేపల్లి ఉప విభాగ మిషన్ భగీరథ గ్రిడ్ డిప్యూటీ కార్యనిర్వాహక ఇంజనీరు వెల్లడించారు.

# భక్తిశ్రద్ధలతో సీతారాముల కళ్యాణం

**కొల్లూర్ లో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని**
**అంగరంగ వైభవంగా నిర్వహించిన మాజీ కౌన్సిలర్ మయూరి రాజు గౌడ్**





పటాన్ చెరు, మార్చి 28 (పోలీస్ నిఘా) : సంగారెడ్డి జిల్లా,పఠాన్ చెరువు నియోజకవర్గం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరు గ్రామంలో లోక కల్యాణం కోసం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ కౌన్సిలర్ మరి రాజు గౌడ్ మరియు కాంగ్రెస్ నాయకులు రాజు గౌడ్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం స్థానిక ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం వారు మాట్లాడుతూ కళ్యాణ వేడుక వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య, శాస్త్రోక్తంగా సీతారాముల కళ్యాణాన్ని జరిపించడం జరిగింది అని అన్నారు,పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో స్వామివారిని, అమ్మవారిని అలంకరించి కన్నుల పండుగగా వేడుకను పూర్తి చేశారు. భారీ జనసందోహం, మా కుటుంబ సభ్యుల పిలుపు మేరకు నియోజకవర్గంలోని వేలాది మంది భక్తులు, కాంగ్రెస్ శ్రేణులు ఈ కళ్యాణ వేడుకకు హాజరయ్యారు. వచ్చిన ప్రతి భక్తుడికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు స్వయంగా నా మిత్రులతో కలిసి పర్యవేక్షించము, కళ్యాణం అనంతరం విచ్చేసిన భక్తులందరికీ భారీ ఎత్తున అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించాము, రాముని పాలన (రామరాజ్యం) అందరికీ ఆదర్శమని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ కళ్యాణాన్ని నిర్వహించినట్లు తెలిపారు. భక్తి మార్గంలో నడవడం వల్ల సమాజంలో శాంతి నెలకొంటుందని అన్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలు, పూల అలంకరణలతో కళ్యాణ మండపం మెరిసిపోయింది. ఈ వేడుక ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యతను చాటిచెప్పింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజు గౌడ్, గోపాల్ రావు, శివన్ రెడ్డి,కుమ్మరి మహేందర్,శివన్ బాలరాజు, పిట్టల శ్రీనివాస్, శంబురం సత్తయ్య, గ్రామ పెద్దలు, గ్రామ యువత, తదితరులు పాల్గొన్నారు.

# సంచలనం సృష్టించిన వృద్ధులపై దాడి కేసు ఛేదన

**నాలుగున్నర తులాల బంగారం రికవరీ, వాహనం స్వాధీనం**
**ముసుగు ధరించి దాడి...48 గంటల్లోనే నిందితుడు అరెస్ట్**
**ప్రత్యేక బృందాలతో వేగవంతంగా కేసు ఛేదించిన పోలీసులు**
**మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస్ రావు**






మెదక్, మార్చి 28 (పోలీస్ నిఘా) : శంకరంపేట–ఆర్ మండలంలోని జంగరాయి గ్రామంలో వృద్ధ దంపతులపై పట్టపగలు దాడి చేసి దోపిడీకి పాల్పడిన సంచలన కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి సుమారు నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం? జంగరాయి గ్రామానికి చెందిన తమ్మల నర్సింలు (48) ఫిర్యాదు మేరకు ఈ నెల 25న మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి ముసుగు ధరించి వారి ఇంట్లోకి చొరబడ్డాడు. ఇంట్లో ఉన్న వృద్ధ దంపతులు తమ్మల అంజయ్య (85), సావిత్రమ్మ (80)పై ఇనుప రాడ్డుతో దాడి చేసి, వారి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో నిందితుడిని గుర్తించారు. శనివారం (28న) ఉదయం 9 గంటలకు తూప్రాన్ బస్ స్టాప్ వద్ద వరిగే వెంకట నారాయణ (40)ను అదుపులోకి తీసుకున్నారు. ఇతడు నాగిరెడ్డిపేట మండలం, కామారెడ్డి జిల్లా వాసి కాగా, ప్రస్తుతం తూప్రాన్‌లో నివాసం ఉంటున్నాడు.నిందితుడి వద్ద నుంచి 2½తులాల బంగారు పుస్తెల తాడు, 1½ తులాల గొలుసు, అర్ధ తులం బంగారు ఉంగరం, అలాగే నేరానికి వినియోగించిన టీవీఎస్ ఎక్సల్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సుమారు 4½ తులాల బంగారం రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు.దర్యాప్తులో నిందితుడు అప్పులు తీర్చుకోవడం కోసం సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ దోపిడీకి పాల్పడినట్లు వెల్లడైంది. బాధితులు తనకు పరిచయం ఉన్న బంధువులేనని తెలిసినా, ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని గమనించి పథకం ప్రకారం నేరానికి పాల్పడినట్లు పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సూచనలతో రామాయంపేట సీఐ వెంకట్ రాజా గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు కృషి చేసి కేసును ఛేదించాయి. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించి ప్రశంస పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు.ఇలాంటి ఘటనల నేపథ్యంలో ప్రజలు అపరిచితులపై నమ్మకం ఉంచకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

# సమగ్ర భూ రీ సర్వే పనులు వేగవంతంగా పూర్తి చేయాలి: కలెక్టర్

**వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని భవాని కుంట తండాలో నక్ష సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్**

**ఎంపిడిఓ కార్యాలయంలో నక్ష సర్వే పురోగతిని సమీక్షించిన కలెక్టర్**



వరంగల్ జిల్లా/వర్ధన్నపేట, మార్చి 28 (పోలీస్ నిఘా) : రాష్ట్ర ప్రభుత్వం భూ వివాదాల పరిష్కారం మరియు యాజమాన్య హక్కుల నమోదు కోసం చేపట్టిన సమగ్ర భూ రీ సర్వే (నక్ష) కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలోని భవానీకుంట తండాలో వివిధ శాఖల అధికారులతో పాటు సర్వే బృందాల సహకారంతో జిల్లా కలెక్టర్ పంట పొలాల్లో నేరుగా పర్యటించారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న భూముల సరిహద్దులు, కొలతలు మరియు సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమగ్ర భూ సర్వేలో భాగంగా జియో కోఆర్డినేట్లు, డ్రోన్ సర్వే మరియు మ్యాపింగ్ సాంకేతికతలను వినియోగించి భూముల హద్దులను ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వేను పూర్తి చేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో నక్ష సర్వే చేపట్టి భూముల హద్దులు, మ్యాపింగ్ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. సర్వేలో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది ఆయా భూములకు సంబంధించిన వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నక్ష సర్వేను సమర్థవంతంగా, వేగవంతంగా పూర్తి చేయడానికి పలు సూచనలు చేశారు. మున్సిపల్ పరిధిలోని 10,240 ఎకరాల వ్యవసాయ భూమిలో 6,379 ఎకరాలకు రీ సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే మొత్తం 4,652 ఇండ్లకు గాను సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 158 బ్లాకులలో 102 బ్లాకుల్లో రీ సర్వే పూర్తయినట్లు తెలిపారు. మిగతా బ్లాకుల్లో కొనసాగుతున్న సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా భూముల కొలతల శాఖ అధికారి శ్రీనివాసులు, ఆర్డీవో సుమ, తహసిల్దార్ విజయ్ సాగర్, ఎంపీడీవో వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ సుధీర్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# గుట్ట దేవస్థానంలో టెండర్ల అవకతవకలు

**టెండర్లను రద్దుచేసి కొత్త టెండర్లు నిర్వహించాలి**
**దేవస్థానం ఆదాయానికి గండి: యానాల దామోదర్ రెడ్డి**



యాదగిరిగుట్ట, మార్చి 28 (పోలీస్ నిఘా) : యాదగిరిగుట్ట దేవస్థానానికి టెండర్ల ద్వారా అవకతవకలు జరిపి ఆదాయానికి గండి కొడుతున్నారని యానాల దామోదర్ రెడ్డి అన్నారు.శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం టెండర్ల అవకతవకలు రద్దు చేసి కొత్త టెండర్లు నిర్వహించాలిసిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు.భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) యాదగిరిగుట్ట మండల కౌన్సిల్ సమావేశం శనివారం గుండ్లపల్లి గ్రామంలో ఆరె పుష్ప అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గత నాలుగు ఐదు నెలలుగా నిర్వహిస్తున్న టెండర్లలో అనేక అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. తక్కువ రేట్లకు టెండర్లు కేటాయించడం వల్ల దేవాలయ ఆదాయానికి గండిపడుతోందని పేర్కొన్నారు. అందువల్ల ఇటువంటి టెండర్లను తక్షణమే రద్దు చేసి పారదర్శకంగా కొత్త టెండర్లు నిర్వహించాలని డిమాండ్ చేశారు.గత నాలుగు నెలల క్రితం గుండం వద్ద నిర్వహించిన రెండు కొబ్బరికాయ దుకాణాలకు సంబంధించిన టెండర్లు గత టెండర్ల కంటే లక్షల రూపాయల తక్కువకు ఇవ్వడం వెనుక ఉన్న కారణాలను అధికారులు వెల్లడించాలని కోరారు. దేవాలయంలో ఒక కొబ్బరికాయను 30 రూపాయలకు విక్రయించాల్సి ఉండగా, ప్రస్తుతం రెండు కొబ్బరికాయలను 100 రూపాయలకు పైగా విక్రయిస్తున్నారని తెలిపారు. దీనివల్ల భక్తులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.అదేవిధంగా వారం రోజుల క్రితం నిర్వహించిన కూల్‌డ్రింక్స్ టెండర్ కూడా గత టెండర్ కంటే తక్కువ రేటుకు ఇవ్వడం దేవాలయానికి నష్టం కలిగించే చర్యగా విమర్శించారు. అధికారులు వెంటనే ఈ రెండు టెండర్లను రద్దు చేసి కొత్తగా టెండర్లు నిర్వహించాలని సిపిఐ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించేందుకు సిపిఐ పార్టీ ఏప్రిల్ 1 నుంచి "ఇంటింటికి సిపిఐ" నినాదంతో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు విరాళాలు అందించి ప్రజా ఉద్యమాలకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోదా శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మున్సిపల్ సెక్రటరీ, కౌన్సిలర్ బబ్బురి శ్రీధర్, మండల కార్యవర్గ సభ్యులు పేరబోయిన పెంటయ్య, పేరబోయిన బంగారి, మీసాల దాసు, ముకర్ల పెంటయ్య, బోదాసు స్వామి, గుండు వెంకటేశ్, పాకాలపాటి రాజు, నేతగాని కిష్టమ్మ, చందు నాయక్, గద్దం యాదమ్మ, ములకలపల్లి సరిత పాల్గొన్నారు.

# అక్రమ బేకరీ ఉత్పత్తుల తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

**ఒకరి అరెస్ట్**
**రూ. 12,54,280 విలువైన సొత్తు స్వాధీనం**





హైదరాబాద్, మార్చి 28 (పోలీస్ నిఘా) : హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ (గోల్కొండ టీమ్) మరియు గుడిమల్కాపూర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో, కేడీ కాలనీ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా, అపరిశుభ్ర వాతావరణంలో నడుస్తున్న అక్రమ బేకరీ తయారీ కేంద్రం గుట్టురట్టు చేశారు. ఈ దాడిలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని, భారీ మొత్తంలో నిల్వ ఉంచిన బేకరీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు.

నిందితుడి వివరాలు:

పేరు: అహ్మద్ రజా (46 ఏళ్లు), తండ్రి: మొహమ్మద్ రజా.,వృత్తి: వ్యాపారం.,నివాసం: హెచ్.నెం. 13-6-429/61, కేడీ కాలనీ, హైదరాబాద్.

స్వాధీనం చేసుకున్న వస్తువులు: పోలీసులు దాడిలో మొత్తం రూ. 12,54,280 విలువైన ముడి పదార్థాలు మరియు యంత్రాలను సీజ్ చేశారు. వాటిలో ముఖ్యమైనవి:

మైదా పిండి (కిచెన్ కింగ్ & సాలాసర్ బ్రాండ్లు): సుమారు 60 బస్తాలు. చక్కెర: 30 బస్తాలు. పామాయిల్: 47 బాక్సులు. హిమానీ బేక్ మ్యాజిక్ నెయ్యి: 188 బాక్సులు.

తయారు చేసిన బిస్కెట్లు (ఓస్మానియా, కాజు, చాయ్, ఫ్యాన్ బిస్కెట్లు), రస్కులు, బటర్ బన్ లు భారీ నిల్వలు.


తయారీకి ఉపయోగించే యంత్రాలు (షుగర్ గ్రైండింగ్, స్పైరల్ మిక్సర్, ఓవెన్ ఎక్విప్మెంట్ మొదలైనవి).

కేసు వివరాలు: నిందితుడు అహ్మద్ రజా ఎటువంటి చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకుండా, అత్యంత అపరిశుభ్రమైన మరియు ప్రమాదకరమైన వాతావరణంలో తక్కువ నాణ్యత గల ముడి పదార్థాలను ఉపయోగించి ఓస్మానియా బిస్కెట్లు, రస్కులు, బటర్ బన్ వంటి ఉత్పత్తులను తయారు చేస్తున్నాడు. వీటిని నగరంలోని వివిధ కిరాణా దుకాణాలు, హోటళ్లు మరియు కేఫ్‌లకు సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతూ అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నాడు. ఇటువంటి కల్తీ ఉత్పత్తులను వినియోగించడం వల్ల ప్రజలు తీవ్రమైన అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉంది.

నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ మరియు స్థానిక పోలీసులు ఈ అక్రమ యూనిట్‌పై దాడి చేసి నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడిపై గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్‌లో Cr. No: 110/2026 U/sec 318(4), 274, 275 BNS కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యవేక్షణ: ఈ దాడిని హైదరాబాద్ సిటీ అడిషనల్ డీసీపీ (టాస్క్ ఫోర్స్) అందె శ్రీనివాసరావు గారి పర్యవేక్షణలో, గోల్కొండ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆర్. వెంకటేష్, గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ చ. రామయ్య, ఎస్సైలు కె. వెంకటరమణ, చ. సురేష్ మరియు సిబ్బంది విజయవంతంగా నిర్వహించారు.


# తల్లిబిడ్డకి మరో జన్మనిచ్చిన గజ ఈతగాళ్లు



భద్రాచలం, మార్చి 28 (పోలీస్ నిఘా) : భద్రాచలం గోదావరి వంతెనపై నుంచి ఒక వివాహిత తన 18 నెలల బిడ్డతో కలిసి గోదావరిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం కలకలం రేపింది. స్వరూప అనే మహిళ తన బిడ్డతో కలిసి వంతెనపై నుంచి నదిలోకి దూకినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు వెంటనే గజఈతగాళ్లకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న గజ ఈతగాళ్లు అప్రమత్తంగా వ్యవహరించి నీటిలో ఉన్న తల్లిబిడ్డను గుర్తించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చాడు. స్వరూప పాల్వంచ కలెక్టర్ కార్యాలయం సమీపంలో నివాసముంటున్నట్లు తెలిసింది. ఇటీవల ఆమె భర్త మృతి చెందినట్లు సమాచారం. అయితే ఆత్మహత్యా యత్నానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. రక్షించబడిన తల్లి,బిడ్డలను వెంటనే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కొత్త ఇంటికి శ్రీకారం

### -బీర్ల అయిలయ్య చేతుల మీదుగా గృహప్రవేశం-



యాదగిరిగుట్ట, మార్చి 28 (పోలీస్ నిఘా) : పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చింతకింద రాజు నూతన గృహప్రవేశ కార్యక్రమం శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమ స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యేకి స్థానిక నాయకులు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆయన రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటి ఆవరణలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.తరువాత చింతకింద రాజు కుటుంబ సభ్యులను శాలువాలతో సన్మానించి, పట్టువస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఒక కల అని, ఆ కల నెరవేరిన ఈ సందర్భం ఎంతో ఆనందదాయకమని అన్నారు. కొత్త ఇంటిలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు నెలకొని కుటుంబం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఇలాంటి శుభ కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, స్నేహాన్ని పెంపొందిస్తాయని, ప్రజల మధ్య అనుబంధాలను బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు.ప్రజలతో కలిసిమెలిసి ఉండడం రాజకీయ నాయకుల బాధ్యత అని, ప్రతి ఒక్కరి సంతోషంలో భాగస్వామ్యం కావడం తనకు ఆనందంగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## టీ గౌరారం కాలనీలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ సంకల్పం



దేవరకొండ , మార్చి 28 (పోలీస్ నిఘా) : నల్గొండ జిల్లా డిండి మండలం టీ గౌరారం కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి కాలనీ ప్రజలు, పెద్దలు శ్రీకారం చుట్టారు. శనివారం నిర్వహించిన గ్రామ సమావేశంలో ఆలయ నిర్మాణ వ్యయం, నిధుల సేకరణపై సుదీర్ఘంగా చర్చించారు.గ్రామంలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణం కోసం రూ. 3,000 విరాళంగా ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ విరాళాలను ఏప్రిల్ 1 నుండి జూన్ 1వ తేదీ లోపు అందజేయాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పేర్ల కళ్యాణి లింగమయ్య మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించడం అభినందనీయమని, తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఉపసర్పంచ్ పిల్లి లక్ష్మమ్మ మాట్లాడుతూ భక్తులు, గ్రామ పెద్దలు భక్తిశ్రద్ధలతో ఈ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిల్లి బాలయ్య, వార్డు సభ్యులు ఆంజనేయులు, పిల్లి వెంకటయ్య, విలేఖరి పేర్ల మహేష్, గ్రామ పెద్దలు నల్లగాసు సత్తయ్య, వరికుప్పల వెంకటేశులు, బద్దె శంకర్, యువకులు మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మెదక్ పట్టణంలో 60 కెమెరాల ఏర్పాటు

### ప్రజల సహకారంతో విస్తృతంగా కెమెరాల ఏర్పాటు

### కెమెరాలతో దొంగతనాలకు అడ్డుకట్ట..

### ఒక్క కెమెరా వంద మంది పోలీసులకు సమానం

### మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు



మెదక్, మార్చి 28 (పోలీస్ నిఘా) : నేర రహిత సమాజ నిర్మాణంలో సీసీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులకు సమానమని ఆయన అన్నారు.మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మున్సిపల్ చైర్మన్, మాజీ చైర్మన్, కౌన్సిలర్ల సహకారంతో 60 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల ప్రారంభోత్సవాన్ని జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. దొంగతనాలు, చోరీలు జరిగితే సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను సులభంగా గుర్తించి పట్టుకోవచ్చని చెప్పారు. ఇప్పటికే అనేక కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడినట్లు వెల్లడించారు.జిల్లాలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా సీసీ కెమెరాల ఏర్పాటు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజల సహకారంతో మరింత భద్రత కల్పించడమే లక్ష్యమని చెప్పారు. ప్రతి కాలనీ, గ్రామంలో కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలపై నియంత్రణ సాధ్యమవుతుందని సూచించారు.దాతలకు జిల్లా ఎస్పీ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, టౌన్ సీఐ మహేష్, ప్రజాప్రతినిధులు, దాతలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుండి వారం పాటు వన్-వే అమలు




హనుమకొండ, మార్చి 28 (పోలీస్ నిఘా) : దామెర మండల పరిధిలోని ఊరుగొండ – ఎన్ఎస్ఆర్ హోటల్ మధ్య నేటి నుండి వారం రోజుల పాటు రోడ్డు మరమ్మతులు. జాతీయ రహదారిపై రోడ్డు పనుల నేపథ్యంలో నేటి నుండి వారం పాటు వన్–వే అమలు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఓవర్ టేకింగ్‌లు చేయొద్దని దామెర ఎస్సై కొంక అశోక్ విజ్ఞప్తి. నేటి నుండి వారం రోజుల పాటు జాతీయ రహదారిపై నెమ్మదిగా వెళ్లాలని వాహనదారులకు పోలీసుల సూచన. ఊరుగొండ మార్గంలో ప్రయాణించే వారు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరిన దామెర ఎస్సై.

## దెందుకూరులో కన్నుల పండుగగా

# కోదండ రాముని కళ్యాణం

**గ్రామ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు**



మధిర, మార్చి 28 (పోలీస్ నిఘా) : చైత్ర శుద్ధ నవమి, శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా దెందుకూరులో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం కన్నుల పండుగగా, భక్తి పరవశంగా జరిగింది. ఈ పవిత్ర ఘట్టం లో అనుముల కృష్ణ శాస్త్రి వేద మంత్రోచ్ఛరణాల సాక్షిగా ఐదు జంటలు పెళ్ళి పీటల మీద సతీసమేతంగా కూర్చుని వేడుక నిర్వహించారు. దెందుకూరు గ్రామం తరపున గ్రామ కోదండరామ స్వామి ఆలయ చైర్మన్ యడ్లపల్లి సీతారామయ్య , గ్రామ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు మరియు పెద్దల దంపతులు కలిసి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. గ్రామ పెద్దలు భక్తులు ప్రజల సమక్షంలో పూజారి వేద మంత్రోచ్ఛరణాల సాక్షిగా శ్రీ సీతారాముల కల్యాణం వైభవం గా కన్నుల పండుగగా నిర్వహించారు. శ్రీ కోదండ రామస్వామి కృపాకటాక్షాలు ప్రజలందరిపై నిత్యం ప్రసరించి సుఖసంతోషాలు, సమృద్ధి కలగాలని పెద్దలు కోరుకున్నారు.

**అన్నదానం**

కళ్యాణం అనంతరం పెద్దల సమక్షంలో నిర్వాహకులు అన్నదానం నిర్వహించి భక్తులకు ప్రసాదం, మధుర పానకం అందించారు.

**ఊరేగింపు, తలంబ్రాలు, కోలాటాలు**

గ్రామంలో శ్రీ సీతారాముల కల్యాణం (కల్యాణోత్సవం) అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి భక్తుల జయజయధ్వానాల మధ్య మంగళ వాయిద్యాలతో, శ్రీ కోదండ రాముని కోలాట బృందం కోలాటాల నడుమ రాములోరు సతీసమేతంగా పల్లకిలో ఊరేగింపుగా క్షేత్రంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

**ప్రత్యేక తలంబ్రాలు**

ఈ ఊరేగింపు సమయంలో శ్రీ సీతారామ తలంబ్రాలను వేద పండితులు మరియు నిర్వాహకులు రాఘవేంద్ర తదితర పెద్దలు భక్తులకు సమర్పించారు ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పాదయాత్రగా వచ్చి ఊరేగింపులో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 30 నిమిషాల్లో 4 లక్షల విలువైన పోగొట్టుకున్న బంగారు ఆభరణాలు, నగదును రికవరీ చేసిన సైఫాబాద్ పోలీసులు




హైదరాబాద్, మార్చి 28 (పోలీస్ నిఘా) : తమిళనాడు రాష్ట్రానికి చెందిన శ్రీమతి మణిమేగల (భర్త దొరస్వామి శెట్టి), ఈ నెల 27వ తేదీ రాత్రి 21:30 గంటల సమయంలో లక్డీకాపూల్ మెట్రో స్టేషన్ బస్టాప్ వద్ద పొరపాటున తన హ్యాండ్‌బ్యాగ్‌ను రాపిడో ఆటోలో వదిలేశారు. ఆ బ్యాగులో 25 గ్రాముల బంగారు గాజులు, 2 గ్రాముల బంగారు కమ్మలు, 30,000 రూపాయల నగదు (మొత్తం విలువ సుమారు రూ. 4,00,000/–) మరియు ముఖ్యమైన పత్రాలు ఉన్నాయి. బాధితురాలి ఫిర్యాదుపై సైఫాబాద్ ఎస్‌హెచ్‌ఓ శ్రీ ఎ. సీతయ్య గారు వెంటనే స్పందించి, క్రైమ్ టీమ్ సభ్యులు హెచ్‌సి 9117 డి. ప్రసాద్ రాజు మరియు పిసి 30700 వి. సురేష్ గౌడ్లను రంగంలోకి దించారు. సాంకేతిక పరిజ్ఞానం మరియు రాపిడో వివరాల ఆధారంగా పోలీసులు తక్షణమే ఆటోను మరియు డ్రైవర్‌ను గుర్తించారు. ఆటో డ్రైవర్ చాదర్‌ఘాట్ పరిధిలో ఉన్నట్లు గుర్తించిన క్రైమ్ టీమ్, వెంటనే అక్కడికి చేరుకుని హ్యాండ్‌బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుంది. డ్రైవర్‌ను, రికవరీ చేసిన సొత్తును సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నగదు, బంగారు ఆభరణాలు అన్నీ భద్రంగా ఉన్నట్లు నిర్ధారించుకున్నాక, ఎస్‌హెచ్‌ఓ శ్రీ ఎ. సీతయ్య గారు వాటిని బాధితురాలికి అందజేశారు. కేవలం 30 నిమిషాల వ్యవధిలోనే ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన సైఫాబాద్ పోలీసుల పనితీరును మరియు సత్వర స్పందనను బాధితురాలు కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు.

## జామా మసీదు కమిటి నూతన పాలకవర్గం ఎన్నిక

### మంత్రి సీతక్క ఆదేశాల మేరకు,

### జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు...



**జామా మసీదు కమిటి నూతన అధ్యక్షులుగా అబ్దుల్ రబ్ బిన్ హైమద్ గారు నియామకం వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన ములుగు జిల్లా బీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వంగ రవి యాదవ్.**

ములుగు, మార్చి 28 (పోలీస్ నిఘా) :శనివారం నాడు ములుగు జిల్లా కేంద్రంలో జామ మసీదు నూతన కమిటీని ఎంపిక చేయగా జామ మసీదు నూతన కమిటి అధ్యక్షులుగా అబ్దుల్ రబ్ బిన్ హైమద్ నియమించగా వారిని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు వంగ రవి యాదవ్ గారు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

జామ మసీదు కమిటి అధ్యక్షులు: అబ్దుల్ రబ్ బిన్ హైమద్ గారు

ఉపాధ్యక్షులు: అబ్దుల్ హాఫీజ్ బాబా గారు

కార్యదర్శి: ఎండి. అఫ్రోజ్ గారు

ఉప కార్యదర్శి: ఎండి. షర్ఫుద్దీన్ గారు

కోశాధికారి: ఎండి. హాజీ పాషా గారు

సభ్యులు: ఎండి. మన్సూర్ అలీ, ఎండి. నజీరుద్దీన్ బాబ్, ఎండి. అన్వర్ పాషా, ఎండి. ఖయ్యూమ్ గార్లు నియమితులవ్వగా వారికి అభినందనలు తెలియజేశారు.

అలాగే జామా మసీదు కమిటి కోసం కృషి చేసిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఆసియా షాహిన్ – రియాజ్ మిర్జా, కౌన్సిలర్ కుత్బుద్దీన్ గార్లను శాలువాతో సత్కరించడం జరిగింది. అనంతరం నూతనంగా ఎంపికైన జామ మసీదు కమిటి సభ్యులు అందరూ ములుగు జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు వంగ రవి యాదవ్ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ములుగు మండలం మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ షకిల్, ములుగు మండల బీసీ సెల్ అధ్యక్షులు ఓంప్రకాష్, ములుగు మండలం మహిళా అధ్యక్షురాలు గుంటోజు పావని, జిల్లా కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ రవికుమార్, మాజీ ఎంపీటీసీ మావరపు తిరుపతిరెడ్డి, లావుడియా రమేష్, జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి ఓడ రాజు, జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి జయకర్, శంకరయ్య చారి, బొజ్జల కుమార్, సలీం, నిరంజన్ చారి, మాదారపు రాజు, ఓరుగంటి అనిల్, గుగ్గిల సృజన్, తణుకుల విజయ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భవనాల ఆస్తి పన్నుల చెల్లింపుల పై దృష్టి సారించండి

### జిల్లా కలెక్టర్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

### కాశీ బుగ్గ ఈ-సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ



హనుమకొండ, మార్చి 28 (పోలీస్ నిఘా) : ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్నుల చెల్లింపుల పై దృష్టి సారించి వసూళ్లు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ పరిధి లోని కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయ ఆవరణ లో గల ఈ–సేవా కేంద్రం తో పాటు వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న పన్ను వసూళ్ల విధానాన్ని పరిశీలించి సమర్థవంతం గా చేపట్టుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయ ఆవరణ లో గల ఈ–సేవా కేంద్రం లో ఆకస్మికంగా సందర్శించి పన్నుల సేకరణ తీరును, ప్రభుత్వ ఆస్తుల బిల్లుల చెల్లింపు తదితర అంశాలను అడిగి తెలుసుకొని మొండి బకాయి ల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నగర పరిధి లోని బకాయి లు పడి ఉన్న రైల్వే, పోస్టాఫీసులు, కే ఎం సి తదితర ప్రభుత్వ కార్యాలయాల కు నోటీసులు అందజేసి వెంటనే పన్నులు చెల్లించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి రెవెన్యు అధికారులు రావుల ఆనంద్, శ్రీనివాస్, ఆర్ ఐ సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ పోలీస్ రేంజ్ కార్యాలయ నూతన భవనంను ప్రారంభించిన సీపీ



వరంగల్, మార్చి 28 (పోలీస్ నిఘా) : నూతనంగా ఏర్పాటు చేసిన వరంగల్ పోలీస్ రేంజ్ పరిపాలన కార్యాలయ భవనాన్ని శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రారంభించారు. హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్ రోడ్లో ఏర్పాటు చేసిన నూతన వరంగల్ పోలీస్ రెంజ్ కార్యాలయంలో వరంగల్ రెంజ్ పోలీస్ అధికారులకు సంబంధించిన శాఖ పరమైన పరిపాలన కార్యకలాపాలు ఈ భవనం నుండి కొనసాగనున్నాయి. ఈ నూతన కార్యాలయంను ప్రారంభించిన సీపీ కార్యాలయంలో సదుపాయాలను పరిశీలించారు.అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ అధికారుల శాఖపరమైన సమస్యలపై రెంజ్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలని, పరిపాలన పనితీరులో పారదర్శకంగా, బాధ్యతాయుతమైన పని తీరు ఉండాలని జీవరంగల్ సీపీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు దార కవిత, అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు సురేష్ కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్ రావు, రేంజ్ కార్యాలయం సూపరింటెండెంట్ యుగేందర్, ఇతర రెంజ్ కార్యాలయ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంప్లాయిస్ మరియు పాత్రికేయుల వెల్నెస్ సెంటర్‌లో మెడికల్ షాపు విభాగం సిబ్బంది దురుసు ప్రవర్తన




హనుమకొండ, మార్చి 28 (పోలీస్ నిఘా) : ఎంప్లాయిస్ మరియు పాత్రికేయుల వెల్నెస్ సెంటర్‌లో మెడికల్ షాపు విభాగం సిబ్బంది దురుసు ప్రవర్తన పై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వైద్య పరీక్షలు పూర్తయ్యాక మెడికల్ షాపులో మందులు తీసుకునే సమయంలో మహిళా సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్ రోగులతో కోపంగా మాట్లాడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. వృద్ధులు, రిటైర్డ్ పెన్షనర్లు, జర్నలిస్టులు గంటల తరబడి నిలబెట్టడం వల్ల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిపారు. ఉన్న పది మంది పేషెంట్లకు త్వరగా మందులు అందించే అవకాశం ఉన్నప్పటికీ.. కావాలనే గంటల తరబడి ఆలస్యం చేస్తున్నారని రోగులు వాపోతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. సమాచారం కోసం ల్యాండ్ ఫోన్ కి ఫోన్ చేస్తే.. కలవకుండా ఫోన్ రిసీవర్ ముందుకు పెట్టడం చేస్తున్నారు. ఇక వెల్నెస్ సెంటర్‌లో వైద్యుల కొరత కూడా ఉందని సమాచారం. కార్డియాలజీ వైద్యులు కొన్ని రోజులుగా రాకపోవడంతో పాటు, ఫిజియోథెరపీ డాక్టర్లు కూడా అందుబాటులో లేకపోవడం రోగులకు ఇబ్బందులు కలిగిస్తోంది.

## ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

### ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు

### శంకర్పల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు నాగమణి, భవాని



శంకర్ పల్లి , మార్చి 28 (పోలీస్ నిఘా) : తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తుంటే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి మహిళలు అని చూడకుండా వారి ఇళ్లళ్లకు వచ్చి అరెస్టు చేయడం సరైంది కాదన్నారు ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల కంటే ముందు ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తామని 18 వేల ఫిక్స్ వేతనం నిర్ణయం చేస్తామని పర్మనెంట్ చేస్తామని తదితర సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు అధికారంలోకి వచ్చాక ఆశా కార్యకర్తలపై పని భారాన్ని పెంచి వారి సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు రాబోయే ఎన్నికలలో కేసీఆర్ కు పట్టిన గతి రేవంత్ రెడ్డి సర్కార్ కు పడుతుందని హెచ్చరించారు పోలీసులు ముందస్తు అరెస్టు చేసిన వారిలో ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు శంకరపల్లి మండల కోశాధికారి స్వప్న ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఢిల్లీ తరలి వెళ్లిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు



సంగారెడ్డి, మార్చి 28 (పోలీస్ నిఘా) : జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు శ్రీ ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో జరుగుతున్న సమావేశం, ధర్నా కార్యక్రమం, బీసీలకు విద్య, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను కేంద్రపరంగా సాధించడానికి ఢిల్లీకి తరలివెళ్లిన సంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు,ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలలో బీసీలకు న్యాయబద్ధంగా రావాల్సిన 42% రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని ఢిల్లీకి రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు ప్రభు గౌడ్ ప్రధాన కార్యదర్శి పార్వతి కృష్ణ మరియు సంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పట్లోళ మల్లికార్జున్ పాటిల్ జిల్లా కార్యదర్శి సుధాకర్ గౌడ్ తరలి వెళ్లారు, 30వ తారీఖున ఢిల్లీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య అధ్యక్షతనతెలంగాణ భవన్లో వివిధ పార్టీల ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేసిన తెలంగాణలోని వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్ల కొరకు సంఘీభావం తెలుపుతూ మరియు 31వ తారీఖున జంతర్ మంతర్ లో ధర్నా చేయటం జరుగుతుందని అలాగే అన్ని విషయాల్లో బీసీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుతగిన ప్రాధాన్యత కల్పించడం లేదు దీనిపైన కూడా చర్చించడం మరియు వివిధ నాయకులను కలిసి సంఘీభావం కోరడం జరుగుతుందని అలాగే కుల గణన జనగణన తొందరగా జరపాలని జిల్లా నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

## జన్నారం ఆదిత్య చిల్డ్రన్ హాస్పిటల్‌లో 'అగ్నిమాపక అవగాహన సదస్సు'



ఉమ్మడి అదిలాబాద్ జిల్లా , మార్చి 28 (పోలీస్ నిఘా) : అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండటం ప్రాణ, ఆస్తి నష్టాలను నివారిస్తుందని జన్నారం అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని ప్రముఖ ఆదిత్య పిల్లల హాస్పిటల్ లో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

ప్రయోగాత్మక ప్రదర్శన మరియు 'PASS' పద్ధతి

ఈ కార్యక్రమంలో భాగంగా అగ్నిమాపక సిబ్బంది హాస్పిటల్ సిబ్బందికి అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఫైర్ ఎక్స్టింగ్విషర్స్ రకాలు మరియు వాటిని ఉపయోగించే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. మంటలను ఆర్పడంలో కీలకమైన 'PASS' పద్ధతి గురించి వివరించారు:

P (Pull): సేఫ్టీ పిన్ లాగడం.

A (Aim): మంటల కింద భాగానికి గురి పెట్టడం.

S (Squeeze): హ్యాండిల్‌ను గట్టిగా నొక్కడం.

S (Sweep): మంటలపై అటు ఇటు కదుపుతూ ప్రయోగించడం.

పాల్గొన్న ప్రముఖులు

హాస్పిటల్ యజమాని మగ్గిడి తిరుపతి మరియు డాక్టర్ గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అగ్ని ప్రమాదాల సమయంలో భయాందోళనలకు గురికాకుండా, సమయస్ఫూర్తితో వ్యవహరించడం ఎలాగో తెలుసుకున్నామని వారు ఈ సందర్భంగా తెలిపారు.

చివరగా, ఆసుపత్రి యాజమాన్యం మాట్లాడుతూ.. రోగుల రక్షణ తమకు అత్యంత ప్రాధాన్యమని, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు సిబ్బందిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని పేర్కొన్నారు. నిరంతరం అగ్నిమాపక నిబంధనలు పాటిస్తూ సురక్షితమైన వాతావరణాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.

## భక్తి భావాన్ని పెంపొందించేందుకే సాంస్కృతిక ప్రదర్శనలు

### తెలంగాణ సాంస్కృతిక యువజన శాఖ సలహా మండలి సభ్యులు అంతడుపుల నాగరాజు



మంచిర్యాల, మార్చి 28 (పోలీస్ నిఘా) : ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించిందికి సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలంగాణ సాంస్కృతిక శాఖ మండలి సలహాదారులు అన్నారు. శుక్రవారం శ్రీరామనవమిని పురస్కరించుకొని క్రేజీ స్టార్స్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పట్టణంలోని యాపల్ లో గల శ్రీ కోదండ రామాలయం వద్ద నిర్వహించిన శ్రీ సీతారాముల కలోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా శ్రీ కోదండ రామాలయం ఆలయ కమిటీ చైర్మన్ సంగార్తి సంతోష్ నటరాజ విగ్రహానికి పూలమాల వేశారు. మంచిర్యాల జిల్లా నృత్య కళా సమస్య సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రాకం సంతోష్ కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి క్రేజీ స్టార్స్ డాన్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేష్ సారధ్యం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్ బెల్టులో కళలకు కొదవలేదని ఈ ప్రాంత ప్రజలు కళలను ఎప్పుడు ఆదరిస్తారని ఆయన పేర్కొన్నారు. అనంతరం మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ప్రముఖ గాయకుడు జంగిలి బాలకృష్ణ వినాయక శ్లోకంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమిక్ష ఆర్ట్స్ అకాడమీ పాలస బృందం ప్రదర్శించిన సీతా రామ కళ్యాణం, హారిక బృందం ప్రదర్శించిన రామ మీరా నృత్య రూపకం అభిజ్ఞ బృందం ప్రదర్శించిన భావములు భాసముల నృత్య రూపకం అలరించాయి. యూట్యూబ్ నృత్య కళాకారిణి అంజలి జానపద నృత్యం, ఆకట్టుకున్నాయి. జానీ బాయ్ ఆర్కెస్ట్రా బృందం కళాకారులు జంగిలి బాలకృష్ణ, ప్రసన్న, సాధనవేణి ప్రభాకర్, కవిత, సింగర్ పోలు సంపత్ లు పాడిన పాటలు ప్రేక్షకులను కట్టి పడేశాయి. అధ్యశ్రీ, సుదీక్ష, ఎస్.కె తాన్య, శ్రీ చరిత, హాసిని చేసిన నృత్యాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

# చిత్రం

## రూటు మార్చి గ్రౌండ్‌లో దిగుతున్న టాలీవుడ్!




టాలీవుడ్ అయినా మరే సినిమా ఇండస్ట్రీ అయినా ఒకానొక సమయంలో ఒక ట్రెండ్‌ను ఫాలో కావడం మనం చూస్తూ ఉంటాం. ఒకసారి బయోపిక్‌ల ట్రెండ్ కొనసాగితే, ఒక సారి యాక్షన్ సినిమాల ట్రెండ్ నడుస్తూ ఉంటుంది. తెలుగు సినిమా ఇండస్ట్రీ విషయానికి వస్తే ఒకానొక సమయంలో ఫ్యాక్షన్ సినిమాల ట్రెండ్ నడిచింది, ఆ తర్వాత ఫ్యామిలీ సినిమాలు, యాక్షన్, కామెడీ, సీక్వెల్స్ ట్రెండ్ ను చూశాం. ఒక సినిమా హిట్ అయితే ఆ ఫార్ములాతో సినిమాలను తీయడం ఇండస్ట్రీలో చాలా కామన్ విషయం. సినిమా ఇండస్ట్రీలో ట్రెండ్ మారడం అనేది చాలా కామన్‌గా జరుగుతూ ఉంటుంది. మొన్నటి వరకు సీక్వెల్స్ ట్రెండ్ చూసిన తెలుగు ప్రేక్షకులు ఇప్పుడు మరో కొత్త ట్రెండ్‌ను చూసేందుకు రెడీ అవుతున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో అర డజనుకు పైగా చిన్నా పెద్ద స్పోర్ట్స్ డ్రామాలు రూపొందుతున్నాయి. హీరోలు వివిధ ఆటలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. బాలీవుడ్‌లో గతంలో చాలా స్పోర్ట్స్ డ్రామాలు వచ్చాయి. కానీ టాలీవుడ్‌లో స్పోర్ట్స్ డ్రామాలు చాలా తక్కువగా వచ్చాయి. ఇప్పుడు ఆ లోటు భర్తీ కాబోతుంది. టాలీవుడ్ ప్రేక్షకులు ఈ మధ్య కాలంలో మంచి కంటెంట్‌తో వచ్చిన సినిమాలను ఆధరిస్తున్నారు. అందుకే ఇప్పుడు టాలీవుడ్‌లో మంచి కంటెంట్‌తో స్పోర్ట్స్ డ్రామాలను తీసుకు వచ్చేందుకు గాను ఫిల్మ్ మేకర్స్ రెడీ అవుతున్నారు. అలాగే హీరోలు సైతం రెడీగా ఉన్నారు. ఈ జాబితాలో మొదట వచ్చే అతి పెద్ద స్పోర్ట్స్ డ్రామా విషయానికి వస్తే రామ్ చరణ్ హీరోగా బుచ్చి బాబు దర్శకత్వంలో రూపొందుతున్న పెద్ది సినిమా. ఈ సినిమాలో రామ్ చరణ్ ఆటగాడు అనే విషయాన్ని ఇప్పటికే మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఆయన క్రికెట్ ఆడుతున్న విధానంకు ఏకంగా ప్రముఖ క్రికెటర్స్ కూడా ఫిదా అవుతున్నారు. అందుకే పెద్ది సినిమా కోసం స్పోర్ట్స్ ప్రియులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రామ్ చరణ్ పెద్దితో పాటు ఆయన మిత్రుడు శర్వానంద్ సైతం ఒక స్పోర్ట్స్ డ్రామాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయ్యాడు. శర్వానంద్ బైకర్ గా కనిపించబోతున్నాడు. బైకర్ సినిమాలో శర్వానంద్ ను చాలా విభిన్నంగా చూడబోతున్నాం. ఆయన లుక్ తో పాటు సినిమా కాన్సెప్ట్ చాలా విభిన్నంగా ఉంటుంది అంటూ ఇప్పటికే మేకర్స్ పదే పదే చెబుతున్నారు. ఇక బైకర్ సినిమాలో రాజశేఖర్ సైతం ఉండటం వల్ల అంచనాలు మరింతగా పెరుగుతున్నాయి. రేసింగ్ రేపథ్యంలో రాబోతున్న మొదటి తెలుగు సినిమాగా దీన్ని చెబుతున్నారు. శర్వానంద్ కు ఈ సినిమా సక్సెస్ అత్యంత కీలకం. కనుక ఈ సినిమా ఫలితంపై ఆయన చాలా ఆశలు పెట్టుకుని ఉన్నాడు. ఇక టైసన్ నాయుడు అనే టైటిల్ తో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఒక సినిమాను చేస్తున్నాడు. ఆ సినిమా గురించి అధికారికంగా ఎలాంటి అప్‌డేట్ లేదు, కానీ సినిమాలో బెల్లంకొండ బాబు బాక్సర్ గా కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే ఈ సినిమా రాబోతుంది. మెగా హీరో వరణ్ తేజ్ ప్రస్తుతం ఒక స్పోర్ట్స్ డ్రామాకు సంబంధించిన షూటింగ్‌కు రెడీ అవుతున్నాడు. ఈయన గతంలో స్పోర్ట్స్ నేపథ్యంలో సినిమాను చేయడం జరిగింది. కానీ ఈసారి అంతకు మించి అన్నట్లుగా ఉండే విధంగా ప్లాన్ చేస్తున్నారట. వాలీబాల్ నేపథ్యంలో వరుణ్ తేజ్ మూవీ ఉంటుంది అనే వార్తలు వస్తున్నాయి. ఇక తమిళ స్టార్ హీరో సూర్య తో తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి రూపొందిస్తున్న సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా సైతం స్పోర్ట్స్ నేపథ్యం అనే వార్తలు వస్తున్నాయి. విభిన్నమైన కాన్సెప్ట్‌తో ఈ సినిమా ఉంటుంది అనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎదురు చూసే విధంగా మేకర్స్ నుంచి ప్రమోషనల్ ప్రకటనలు వచ్చాయి. ఈ సినిమాలు కాకుండా మరికొన్ని చిన్న సినిమాలు సైతం స్పోర్ట్స్ నేపథ్యంతో రాబోతున్నాయి. ఈ ఏడాదిలో మొత్తంగా అరడజనుకు తగ్గకుండా స్పోర్ట్స్ డ్రామా సినిమాలు రాబోతున్నాయి.

## కరుప్పుపై భారీ హైప్.. టెన్షన్‌లో ఫ్యాన్స్



సూర్య నటించిన కరుప్పు సినిమా రిలీజ్ కు రెడీ అవుతున్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్ట్ చుట్టూ ఆసక్తికరమైన చర్చలు నడుస్తున్నాయి. ముఖ్యంగా ఇది సూర్య కెరీర్‌లో ఒక కీలక మలుపుగా మారుతుందా అనే ప్రశ్న ఇప్పుడు అభిమానుల్లో ఎక్కువగా వినిపిస్తోంది. గత కొన్ని సినిమాలుగా ఆయన చేసిన ప్రయోగాలు విమర్శకుల ప్రశంసలు పొందినా, ఫ్యాన్స్ కోరుకునే సూర్య మాత్రం కనిపించలేదనే భావన ఉంది. ఈ నేపథ్యంలో కరుప్పు ఆ లోటును తీర్చగలదా అన్నది ఇప్పుడు ప్రధాన చర్చాంశంగా మారింది. డైరెక్టర్ ఆర్జే బాలాజీ ఈ సినిమాను కేవలం కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా మాత్రమే కాకుండా, ఒక స్పష్టమైన సోషల్ మెసేజ్ తో తెరకెక్కించినట్లు చెప్పడం ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం తమిళ సినీ పరిశ్రమలో హీరోలను ఎక్కువగా రౌడీలు లేదా పోలీసులుగా చూపించే ట్రెండ్ పెరిగిందని, దీంతో పాత్రల్లో సహజత్వం, వైవిధ్యం తగ్గిపోయిందని బాలాజీ అభిప్రాయపడుతున్నారు. కరుప్పు ద్వారా సాధారణ మనుషుల కథలను, రోజువారీ జీవితానికి దగ్గరగా ఉండే పాత్రలను తెరపైకి తీసుకురావడానికి బాలాజీ ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే, సినిమా ప్రమోషన్స్ మాత్రం మరింత పెద్ద చర్చకు దారితీస్తున్నాయి. ఈ సినిమా రిలీజ్ కు ముందే భారీ స్థాయిలో హైప్ క్రియేట్ అవుతోంది. ఇంటర్వ్యూలు, ఈవెంట్లు, స్టేట్మెంట్స్ ఇవన్నీ కరుప్పు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. కానీ ఇదే అంశం ఇప్పుడు రిస్క్‌గా మారే అవకాశం కూడా ఉంది. అంచనాలు ఎక్కువైపోయి, తర్వాత సినిమాలోని కంటెంట్ వాటిని అందుకోలేకపోతే నెగటివ్ టాక్ వేగంగా వ్యాపించే ప్రమాదం ఉంది. అందుకే కొందరు విశ్లేషకులు ప్రమోషన్స్‌లో కొంత నియంత్రణ అవసరమని సూచిస్తున్నారు. ఇక బడ్జెట్ పరంగా చూస్తే, కరుప్పు ఓ భారీ ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. తన గత సినిమాతో పోలిస్తే దాదాపు 15 రెట్లు ఎక్కువ ఖర్చు పెట్టారని ఆర్జే బాలాజీ వెల్లడించారు. ఇది సినిమా స్కేల్, ప్రొడక్షన్ వాల్యూస్ ఎంత పెద్దగా ఉన్నాయో చూపిస్తోంది. అయితే అదే సమయంలో ఇది ఒక పెద్ద రిస్క్ కూడా. భారీ పెట్టుబడిని రికవర్ చేయాలంటే సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోవాల్సి ఉంటుంది. ఫ్యాన్స్ పరంగా చూస్తే, కరుప్పుపై ఎక్స్‌పెక్టేషన్స్ స్పష్టంగా కనిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో సూర్యకు మళ్లీ పాత ఇమేజ్ వస్తుందని, ఈ సినిమా ఆయనకు స్ట్రాంగ్ కంబ్యాక్ అవుతుందని భావిస్తున్నారు. చాలా కాలంగా మిస్సైన సూర్యను తిరిగి చూడాలనే కోరిక అభిమానుల్లో ఉంది. ఆ ఎమోషన్ ఈ సినిమాకు పెద్ద ప్లస్‌గా మారే అవకాశం ఉంది. మరి మే 14న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

## బాలీవుడ్ ఎంట్రీతో శ్రీలీలకి బ్రేక్ దొరుకుతుందా?



టాలీవుడ్ సెన్సేషనల్ బ్యూటీ శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో ఒక గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. 'పెళ్ళి సందడి', 'ధమాకా' వంటి సినిమాలతో టాలీవుడ్‌లో తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్న ఈ భామకు, ఇటీవల వరుస పరాజయాలు పెద్ద దెబ్బ తీశాయి. తాజాగా విడుదలైన 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించకపోవడంతో శ్రీలీల ఆశలన్నీ అడియాశలయ్యాయి. ఒకప్పుడు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా వెలిగిన ఈమె చేతిలో ప్రస్తుతం ఒక్క క్రేజీ తెలుగు ప్రాజెక్ట్ కూడా లేకపోవడం గమనార్హం. అందుకే ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ తన దృష్టిని బాలీవుడ్ వైపు మళ్ళించింది. ఆ వివరాలు చూద్దాం .. శ్రీలీల కెరీర్ ఒకప్పుడు రాకెట్ లా దూసుకుపోతుందనుకున్నారు అందరూ. ఆమె డ్యాన్స్, ఎనర్జీకి ఫిదా అయిన స్టార్ హీరోలందరూ తమ సినిమాల్లో ఆమెనే హీరోయిన్‌గా తీసుకోవాలని పోటీ పడ్డారు. కానీ, కథల ఎంపికలో జరిగిన పొరపాట్లు ఆమెను ఇబ్బందుల్లోకి నెట్టాయి. 'ఆదికేశవ', 'స్కంద', 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' వంటి సినిమాలు వరుసగా ఫ్లాప్ అవ్వడం శ్రీలీల మార్కెట్‌ను దెబ్బతీసింది. తాజాగా వచ్చిన పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా ఫెయిల్ అవ్వడంతో టాలీవుడ్ మేకర్స్ ఈమె వైపు చూడటానికి కాస్త ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. తెలుగులో అవకాశాలు తగ్గుతున్న క్రమంలో శ్రీలీల ఇప్పుడు బాలీవుడ్ ఎంట్రీతో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. బాలీవుడ్ యంగ్ స్టార్ కార్తీక్ ఆర్యన్ సరసన ఒక భారీ ప్రాజెక్ట్‌లో నటించే అవకాశం దక్కించుకుంది. హిందీ మార్కెట్ లో ఈ సినిమా కనుక క్లిక్ అయితే, శ్రీలీల రేంజ్ మళ్ళీ మారిపోవడం ఖాయం. గ్లామర్ పరంగా, డ్యాన్స్ పరంగా బాలీవుడ్ ప్రేక్షకులను ఆకట్టుకోవడం శ్రీలీలకు పెద్ద కష్టమేమీ కాదు. ఇక మరి ఈ బాలీవుడ్ బ్రేక్ ఆమె కెరీర్‌ను మళ్ళీ ట్రాక్ లోకి ఎక్కిస్తుందో లేదో వేచి చూడాలి. శ్రీలీల కేవలం బాలీవుడ్ మాత్రమే కాదు, కోలీవుడ్ మీద కూడా కన్నేసింది. వెర్సటైల్ యాక్టర్ ధనుష్‌తో కలిసి ఒక సినిమాలో నటిస్తున్నట్లు సమాచారం. ధనుష్ వంటి స్టార్ హీరో పక్కన ఛాన్స్ రావడం శ్రీలీలకు దొరికిన గోల్డెన్ ఆఫర్ అని చెప్పాలి. తమిళ్ మార్కెట్ లో కూడా తన సత్తా చాటితే, సౌత్ ఇండియా మొత్తం మళ్ళీ ఈమె జపం చేయడం ఖాయం. ఇక ప్రస్తుతం తన ఫోకస్ మొత్తం టాలీవుడ్ బయటే పెట్టిన ఈ భామ, ఇతర భాషల్లో సక్సెస్ సాధించి మళ్ళీ తెలుగులో గ్రాండ్ కమ్‌బ్యాక్ ఇవ్వాలని ప్లాన్ చేస్తోంది. సినిమా ఇండస్ట్రీలో హిట్లు, ఫ్లాపులు సహజం. ఒకప్పుడు టాప్ లో ఉన్న హీరోయిన్లు కూడా ఇలాంటి కష్టకాలాన్ని చూసినవారే. శ్రీలీలకు ఉన్న టాలెంట్, డ్యాన్సింగ్ స్కిల్స్ మరే హీరోయిన్‌కు లేవనే చెప్పాలి. కేవలం ఒక సాలిడ్ హిట్ పడితే చాలు, మళ్ళీ శ్రీలీల డేట్స్ కోసం నిర్మాతలు క్యూ కడతారు. బాలీవుడ్ మరియు కోలీవుడ్ ప్రాజెక్టులు ఆమెకు ఆ ఊపును ఇస్తాయని ఫ్యాన్స్ గట్టిగా నమ్ముతున్నారు. ఇక మరి శ్రీలీల తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ఎంత పవర్‌ఫుల్‌గా స్టార్ట్ చేస్తుందో రాబోయే రోజుల్లో చూడాలి!

## రీమేక్‌ల ట్రెండ్‌లో అజయ్ దేవ్‌గన్..



బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవ్‌గన్ ఇతర భాషల్లోని సూపర్ హిట్ చిత్రాలను హిందీలో రీమేక్ చేయడంలో ఎప్పుడూ ముందుంటారు. అయితే, ఈ రీమేక్ ప్రయాణం ఆయనకు విజయాలతో పాటు ఊహించని వివాదాలను కూడా తెచ్చిపెడుతోంది. తాజాగా తమిళ బ్లాక్ బస్టర్ 'ఖైదీ' రీమేక్ 'భోలా' చుట్టూ ముసురుకున్న చట్టపరమైన చిక్కులు అజయ్‌ను ఇబ్బందుల్లోకి నెట్టాయి. గతంలో 'దృశ్యం' సమయంలోనూ ఇలాంటి సమస్యలే తలెత్తగా, ఇప్పుడు మళ్ళీ అదే రిపీట్ అవ్వడం బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తమిళంలో కార్తీ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన 'ఖైదీ' ఎంతటి సంచలనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను అజయ్ దేవ్‌గన్ స్వయంగా దర్శకత్వం వహిస్తూ 'భోలా' పేరుతో హిందీలో రీమేక్ చేశారు. అయితే, ఒరిజినల్ ప్రొడక్షన్ హౌస్ 'డ్రీమ్ వారియర్ పిక్చర్స్' ఇప్పుడు అజయ్ టీమ్‌పై ఫిర్యాదు చేసింది. ఇక ఒప్పందంలో కుదుర్చుకున్న పరిధిని దాటి సినిమాలో మార్పులు చేశారని, హక్కుల విషయంలో నిబంధనలను ఉల్లంఘించారని వారు ఆరోపిస్తున్నారు. ఇది అజయ్ దేవ్‌గన్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. అజయ్ దేవ్‌గన్ కెరీర్‌లో అతిపెద్ద రీమేక్ హిట్ 'దృశ్యం'. అయితే ఈ సినిమా సమయంలో కూడా ఆయనకు ఇబ్బందులు తప్పలేదు. ఇక అప్పట్లో దర్శకురాలు గీతూ మోహన్ దాస్‌తో క్రియేటివ్ పరంగా విభేదాలు వచ్చాయని వార్తలు వచ్చాయి. ఒక హిట్ సినిమాను మరో భాషలోకి మార్చేటప్పుడు ఒరిజినల్ ఆత్మ దెబ్బతినకుండా చూడటం ఒక ఎత్తైతే, లీగల్ సమస్యలు రాకుండా చూసుకోవడం మరో ఎత్తు. అజయ్ విషయంలో ఈ వివాదాలు పదే పదే పునరావృతం కావడం ఆయన ప్లానింగ్‌పై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. తమిళ నిర్మాతల ఫిర్యాదు ప్రకారం.. 'భోలా' టీమ్ ఒప్పందంలో ఉన్న కండిషన్లను పాటించలేదని తెలుస్తోంది. ఇక నిర్ణీత సమయంలోగా చెల్లింపులు జరపకపోతే లేదా నిబంధనలు అతిక్రమిస్తే సినిమా హక్కులు మళ్ళీ ఒరిజినల్ మేకర్స్‌కే దక్కుతాయని అగ్రిమెంట్‌లో ఉందట. ఇక ఒకవేళ 30 రోజుల్లోగా ఈ సమస్య పరిష్కారం కాకపోతే 'భోలా'కు సంబంధించిన హక్కులన్నీ మళ్ళీ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ చేతికే వెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుతం అజయ్ దేవ్‌గన్ టీమ్ ఈ విషయంపై స్పందించాల్సి ఉంది. సౌత్ సినిమాలను హిందీలో రీమేక్ చేసి హిట్లు కొట్టడం అజయ్‌కు అలవాటే కానీ, ప్రతిసారి ఇలాంటి వివాదాల్లో చిక్కుకోవడం ఆయన ప్రతిష్టను దెబ్బతీస్తోంది. ఇక కేవలం హక్కులు కొంటే సరిపోదు, ఆ ఒప్పందంలోని లోతుపాతులను కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి ఈ 'భోలా' వివాదం సుఖాంతం అవుతుందా లేక అజయ్ కోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తుందా అనేది వేచి చూడాలి. ఏదేమైనా రీమేక్‌ల ట్రెండ్‌లో అజయ్ జాగ్రత్తగా అడుగులు వేయాల్సిన సమయం వచ్చింది.

## బెంగాల్ టీఎంసీ ప్రభుత్వంపై
# అమిత్ షా 'ఛార్జ్‌షీట్'



కోల్‌కతా, మార్చి 28 : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. టీఎంసీ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ కేంద్రమంత్రి అమిత్ షా 'ఛార్జ్‌షీట్' విడుదల చేశారు. 15 ఏళ్ల టీఎంసీ దుష్పరిపాలన, బెంగాల్‌ను ఆ పార్టీ అవినీతిమయంగా ఎలా మార్చిందనే విషయాలను ఆ ఛార్జ్ షీట్‌లో పేర్కొన్నారు. గత 15 ఏళ్లుగా బెంగాల్‌లో అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు నడుస్తున్నాయని..శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. టీఎంసీ ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల సిలిగుడి కారిడార్ భద్రతకు ముప్పు వాటిల్లిందని ఆరోపించారు. గతంలో అస్సాంలోనూ చొరబాటుదారులు ప్రవేశించేవారని.. భాజపా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అక్కడ చొరబాట్లు ఆగిపోయాయని అమిత్ షా అన్నారు. ప్రస్తుతం కేవలం బెంగాల్ నుంచే భారత్‌లోకి చొరబాటుదారులు ప్రవేశిస్తున్నారని ఆరోపించారు. దేశ భద్రతకు ఇది ఆందోళనకరంగా మారిందన్నారు. కోర్టు ఆదేశాల తర్వాత కూడా బార్డర్ ఫెన్సింగ్ కోసం బీఎస్ఎఫ్‌కు టీఎంసీ ప్రభుత్వం భూమిని కేటాయించట్లేదని ఆరోపించారు. రాష్ట్ర పోలీసులు, అధికారులు అక్రమ వలసలను అడ్డుకోకపోవడం వల్ల వారు నకిలీ పత్రాలతో బెంగాల్ ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాల్లోకి వస్తున్నారన్నారు. వారిని అడ్డుకోవడానికి బదులుగా చొరబాటుదారుల ఓట్లు పోతాయనే భయంతో మమత 'సర్' ప్రక్రియపై, ఎన్నికల కమిషన్‌పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బెంగాల్‌లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చొరబాట్లను అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకుంటామని..సరిహద్దు కంచె వేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

## ఎన్నికల్లో గెలిచిన వెంటనే
# ఢిల్లీని స్వాధీనం చేసుకుంటా



### పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

రాణిగంజ్, మార్చి 28 (పోలీస్ నిఘా) : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్‌లో శుక్రవారం రామనవమి శోభాయాత్ర జరుగుతున్న సమయంలో ఘర్షణలు చోటుచేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పశ్చిమ బెంగాల్‌ను ధ్వంసం చేయాలని చూస్తే భాజపా దేశంలో అధికారాన్ని కోల్పోవడం ఖాయమని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఢిల్లీని స్వాధీనం చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ముందుకువెళ్తానన్నారు. బెంగాల్‌లోని రాణిగంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగించి ప్రజలందరినీ బయటకు గెంటేస్తారని మమత ఆరోపించారు. తమ గెలుపు కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటూ భాజపా నేతలు అన్ని హద్దులను దాటుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు హడావిడిగా 'సర్' ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. ఓటరు జాబితా నుంచి బెంగాలీ ఓటర్లను తొలగించడానికి ఎన్నికల కమిషన్‌ను భాజపా పావులా వాడుకుంటోందన్నారు. రాష్ట్రంలో భాజపా ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. రాణిగంజ్‌లోని పర్వత ప్రాంతాల్లో తరచూ కొండచరియలు విరిగిపడుతుండడం వల్ల అక్కడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మమత ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి ప్రమాదకర ప్రాంతాలను విడిచిపెట్టి.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లే వారికి తమ ప్రభుత్వం గృహవసతితో పాటు రూ.10 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని హామీ ఇచ్చారు.

## విశాఖ-ఢిల్లీ.. ఇంజిన్ వైఫల్యంతో
# విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్



న్యూఢిల్లీ, మార్చి 28 : విశాఖపట్నం నుంచి ఢిల్లీకి వెళ్తున్న ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఢిల్లీ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ఘటన సమయంలో విమానంలో 161 మంది ప్రయాణికులు ఉన్నారు. శనివారం ఇండిగోకు చెందిన బోయింగ్ 737 విమానం విశాఖపట్నం నుంచి ఢిల్లీకి బయలుదేరింది. మరికొద్ది సేపట్లో ఢిల్లీలో ల్యాండ్ అవుతుందనగా.. విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. విమానం ఇంజిన్ ఒక్కసారిగా పనిచేయడం ఆగిపోయినట్లు సిబ్బంది గుర్తించారు. పైలట్ సమాచారంతో వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీ విమానాశ్రయంలో ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. 10:53 గంటలకు విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని అగ్నిమాపక అధికారులు తెలిపారు. విమానానికి కూడా ఎలాంటి నష్టం జరగలేదని వెల్లడించారు.

## మొజ్తాబా ఖమేనీ కూడా చనిపోయే ఉంటాడు: ట్రంప్



వాషింగ్టన్, మార్చి 28 : ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీని ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ నాయకత్వం మొత్తాన్ని తుడిచిపెట్టామని, మొజ్తాబా చనిపోయే ఉంటారంటూ మియామిలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. "ఇరాన్ అత్యున్నత నాయకత్వం, మిలిటరీ శక్తి ధ్వంసమైంది. వారి నాయకులు చనిపోయారు. వారికి ఇప్పుడు సుప్రీం లీడరే లేరు. ఆయన చనిపోయారు. ఆయన నుంచి ఎలాంటి ప్రకటనలు రావట్లేదు కాబట్టి.. ఆయన చనిపోయి ఉండాలి, లేకపోతే ఆయన పరిస్థితి విషమంగానైనా ఉండాలి" అని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో భీకర పోరు కొనసాగుతోంది. ఇలాంటి సమయంలో సుప్రీం నేతగా ఎన్నికైన మొజ్తాబా పేరిట ఎలాంటి ప్రకటనలు రావడం లేదు. అలాగే ఆయన ఇప్పటివరకు బహిరంగంగా కనిపించలేదు. దీంతో ఆయన ఆరోగ్యంపైనా పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# పంచాయతీ పద్దులకు ఏకగ్రీవ ఆమోదం



హైదరాబాద్, మార్చి 28 (పోలీస్ నిఘా) : రాష్ట్ర శాసనసభలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల బడ్జెట్ పద్దులు విస్తృత చర్చ అనంతరం ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. ప్రభుత్వ కార్యక్రమాలు, అమలు విధానం, నిధుల వినియోగం వంటి అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది. అంతకుముందు ఆయా శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడారు. మన దేశపు ప్రాణం పల్లెలు.. పల్లెలు బాగుంటేనే దేశం బాగుంటుంది అని చెప్పారు. ఇండియా లివ్స్ ఇన్ విలేజెస్ అన్న మహాత్ముని మాటలు మనకు స్ఫూర్తిదాయకాలని, గ్రామాభివృద్ధి దిశగా కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందంజలో నిలిచిందని అన్నారు. గ్రామ పంచాయతీలకు బలం చేకూర్చింది కాంగ్రెస్ పార్టీయేనని, స్థానిక స్వపరిపాలనకు రాజ్యాంగ హామీ ఇచ్చింది కూడా కాంగ్రెస్సేనని చెప్పారు. 73వ రాజ్యాంగ సవరణ (1992) ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు చట్టబద్ధత తీసుకొచ్చిందన్నారు. ఇది గ్రామాలకు అధికారాన్ని, ప్రజలకు స్వయం నిర్ణయాధికారాన్ని అందించిందని తెలిపారు. ప్రజల చేతుల్లోనే అధికారాన్ని పెట్టడమే నిజమైన ప్రజాస్వామ్యం.. ఈ సిద్ధాంతాన్ని కాంగ్రెస్ కార్యరూపంలోకి తీసుకొచ్చిందని, గ్రామాల అభివృద్ధి కోసం పలు కీలక కార్యక్రమాలను అమలు చేసిందని చెప్పారు. పంచాయతీలకు నిధులు, విధులు, అధికారాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి భద్రత కల్పిస్తూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, చెరువుల పునరుద్ధరణ, రోడ్లు, నీటి వనరుల నిర్మాణం చేపట్టిందని తెలిపారు. మహిళా సాధికారతలో కూడా కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందన్నారు. పంచాయతీలలో మహిళలకు 33% రిజర్వేషన్ ఇచ్చి గ్రామ పాలనలో మహిళల పాత్రను పెంచిందని, సామాజిక న్యాయం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు పంచాయతీలలో ప్రాతినిధ్యం కల్పించిందని తెలిపారు. గ్రామస్థాయిలో సమానావకాశాలు కల్పించే విధానాలను అమలు చేసిందన్నారు. రాజీవ్ గాంధీ మాటలు తమకు స్ఫూర్తి అని, గ్రామీణాభివృద్ధిని కేవలం మౌలిక వసతులకే పరిమితం చేయకుండా ప్రజల సాధికారత వైపు కాంగ్రెస్ దృష్టి పెట్టిందన్నారు. బలమైన పల్లెలు బలమైన జాతిని నిర్మిస్తాయన్న నమ్మకంతో గ్రామాభివృద్ధి కోసం కాంగ్రెస్ నిరంతరం కృషి చేసిందని, ఇంకా చేస్తూనే ఉంటుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

**సభ్యుల ప్రశ్నలకు సవివరంగా సమాధానం**

చర్చలో సంబంధిత శాఖలపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు దాదాపు గంటన్నరపాటు ఓపికగా, వివరణాత్మకంగా మంత్రి సీతక్క సమాధానాలు ఇచ్చారు. ప్రతి అంశాన్ని స్పష్టంగా వివరించి సందేహాలను నివృత్తి చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమం వంటి కీలక రంగాల్లో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.

**వాస్తవాలు, ఆధారాలతో విపక్షాలకు కౌంటర్**

విపక్షాలు లేవనెత్తిన ఆరోపణలకు మంత్రి సీతక్క తగిన ఆధారాలతో సమాధానం ఇస్తూ గత ప్రభుత్వాల వైఫల్యాలను సభ దృష్టికి తెచ్చారు. తప్పుడు ప్రచారాలను ఖండిస్తూ తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఖర్చు చేసిన నిధుల వివరాలను గణాంకాలతో వివరించారు. గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, తాగునీటి సరఫరా విస్తరణ, మహిళా–శిశు సంక్షేమ కార్యక్రమాల్లో సాధించిన పురోగతిని సభ ముందుంచారు. మొత్తంగా అన్ని రంగాల్లో సమతుల అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల బలోపేతం, మహిళల సంక్షేమం, శిశు సంరక్షణ వంటి అంశాల్లో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

**బీజేపీ సభ్యులకు మంత్రి సీతక్క చురకలు**

పేదలకు ఉపాధి కల్పించే ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తోందని మంత్రి సీతక్క బీజేపీ సభ్యుల నుద్దేశించి విమర్శించారు. అసెంబ్లీలో ఎనిమిదిమంది అష్ట దిగ్బంధ పాలకులు (బీజేపీ) ఉన్నారని, వారు కేంద్రం తో మాట్లాడి తెలంగాణకు నిధులు తేవాలని డిమాండ్ చేశారు.

**బీఆర్ఎస్ వాకౌట్‌పై సీతక్క ఫైర్**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాలను అభివృద్ధి చేయలేదు.. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తాము ఎక్కడా ఆపలేదు. జరిగిన పనులను మరింత ముందుకు తీసుకెళ్తాము. ఇప్పటికీ చాలా గ్రామాల్లో నీటి వసతి వసతి లేదు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆత్మీయ భరోసా అందరికీ అందడంలేదు.. సమస్యలు ఉంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లెటర్ ఇవ్వండి.. మాట్లాడితే వాకౌట్ చేయడం సరైన విధానం కాదు. స్వీపింగ్ రిమార్క్ చేసి వాకౌట్ పేరుతో డ్రామాలు ఆడుతోంది.. పరిపాలనలో ఏదైనా ఇబ్బంది ఉంటే సెట్ చేసుకుంటాం.. సునీతా లక్ష్మారెడ్డి అసత్యాలు మాట్లాడరు అని అన్నారు.

# బీసీలకు అన్యాయం చేసింది బీఆర్ఎస్ పార్టీనే

### అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, మార్చి 28 (పోలీస్ నిఘా) : తెలంగాణ అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ సభ్యుల తీరుపై దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమైన అంశాలపై సభలో చర్చ జరుగుతుంటే వాకౌట్ చేయడం బీఆర్ఎస్ సభ్యుల చిత్తశుద్ధి లేమికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. గత పదేళ్ల పాలనలో బీసీలకు అన్యాయం చేసింది బీఆర్ఎస్ పార్టీయేనని ఆరోపించారు. అలాంటిది ఇప్పుడు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి ఎక్కడిదని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై తమ ప్రభుత్వం రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు అడుగు ముందుకేస్తుంటే, బీఆర్ఎస్ సభ్యులు అక్కసుతో పది అడుగులు వెనక్కి లాగే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

**వాకౌట్ డ్రామాలొద్దు..**

సభలో చర్చకు నిలబడలేక బీఆర్ఎస్ సభ్యులు బయటకు వెళ్లడంపై మంత్రి శ్రీధర్ బాబు సెటైర్లు వేశారు. వాకౌట్ చేస్తే రోజంతా చేయాలి.. కానీ ఇలా బయటకు వెళ్లి, మళ్లీ అలా లోపలికి రావడం ఏంటని ఫైర్ అయ్యారు. ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారనే విషయం మర్చిపోవద్దని హితవు పలికారు. బీసీలపై నిజంగా ప్రేమ ఉంటే బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని, వాటిని స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

**ఆర్టీసీ, పోలీస్ సంక్షేమంపై స్పష్టత**

కేవలం ఇన్నోవాలు సమకూర్చడమే పోలీస్ సంక్షేమం కాదని, పోలీసుల నిజమైన సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీని నిర్వీర్యం చేశారని, కార్మికులు సమ్మె చేసినప్పుడు కనీసం మాట్లాడేందుకు ఒక్కరంటే ఒక్కరూ వెళ్లలేదని విమర్శించారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టించింది తమ ప్రభుత్వమేనని వివరించారు. పారదర్శకత కోసం టెక్నాలజీ ఆధారిత విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని వెల్లడించారు.

**వచ్చే ఎనిమిదేళ్లూ మాదే అధికారం..**


ప్రభుత్వ కాలపరిమితిపై వస్తున్న ప్రచారాలకు మంత్రి శ్రీధర్ బాబు గట్టి కౌంటర్ ఇచ్చారు. తమకు ఇంకా మూడేళ్ల సమయం ఉందని.. ఆ తర్వాత కూడా తెలంగాణలో అధికారంలోకి వచ్చేది తామేనని స్పష్టం చేశారు. అంటే మొత్తం ఎనిమిదేళ్ల సమయం తమకు ఉందంటూ సెటైర్లు వేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, రాజ్యాంగ సవరణ చేసి బీసీలకు ఇచ్చిన హామీని నెరవేరుస్తామని శ్రీధర్ బాబు అన్నారు.

# నేపాల్ మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ అరెస్ట్



నేపాల్, మార్చి 28 : నేపాల్ మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ అరెస్టయ్యారు. గతేడాది దేశంలో జరిగిన జెన్‌జీ నిరసనలను హింసాత్మకంగా అణచివేశారనే ఆరోపణలపై ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా.. నేపాల్ నూతన ప్రధానిగా బాలేంద్ర షా ప్రమాణం చేసిన మరుసటిరోజే ఈ అరెస్టు జరగడం గమనార్హం. భక్తపుర్‌లో ఉన్న ఓలీ నివాసం నుంచి పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. మాజీ హోంమంత్రి రమేశ్ లేఖక్‌ను కూడా అరెస్టు చేశారు. మాజీ ప్రధాని అరెస్టును కొత్త హోం వ్యవహారాలశాఖ మంత్రి సుడాన్ గురంగ్ సోషల్ మీడియా వేదికగా ధ్రువీకరించారు. 'ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. చట్టానికి ఎవరూ అతీతులు కారు. మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీతో పాటు మాజీ హోం మంత్రి రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నాం. ఇది ప్రతీకార చర్య కాదు.. న్యాయ ప్రక్రియకు ఆరంభం మాత్రమే' అని రాసుకొచ్చారు. పోలీసులు తీసుకెళ్తుండగా ఓలీ మీడియాతో మాట్లాడుతూ.. ఇది కక్షపూరిత చర్యగా అభివర్ణించారు. దీనిపై తాను న్యాయపోరాటం చేస్తానని వ్యాఖ్యానించారు. గతేడాది సామాజిక మాధ్యమాల నిషేధంతో మొదలై.. అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా నేపాల్‌లో పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. ఈ క్రమంలో జరిగిన ఘర్షణల్లో 19 మంది యువకులతో సహా 70 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. దీంతో కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఆ తర్వాత తాత్కాలిక ప్రధానిగా సుశీల నియమితులయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో బాలేంద్ర షా నేపాల్ కొత్త ప్రధానిగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఆయన ప్రమాణం చేసిన అనంతరం.. మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో జెన్ జీ ఉద్యమంపై దర్యాప్తు జరిపిన ఉన్నతస్థాయి కమిషన్ సిఫార్సులను తక్షణమే అమలుచేయాలని నిర్ణయించారు. ఆందోళనకారులపై కాల్పులు జరపమని ఆదేశాలు ఉన్నట్లు రుజువు కాలేదని కమిషన్ తన నివేదికలో పేర్కొంది. అయితే, కాల్పులను ఆపేందుకు కూడా నాడు అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రయత్నించలేదని, వారి నిర్లక్ష్యం వల్ల మైనర్లు కూడా ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. కాగా.. ఆందోళనల సమయంలో నేపాల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా ఉన్న చంద్రకుబేర్ ఖాపుంగ్‌తో సహా అనేకమంది ఇతర ఉన్నతాధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. అయితే, నివేదికలోని అంశాలను ఓలీ తిరస్కరించారు. కమిషన్ సిఫార్సు ఆధారంగా కోర్టు విచారణలో వీరు దోషులుగా తేలితే.. 10 ఏళ్ల వరకు జైలు శిక్ష ఎదుర్కొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## భూతల దాడులు చేయకుండానే మా లక్ష్యాలు సాధిస్తాం: మార్కో రూబియో



వాషింగ్టన్, మార్చి 28 : ఇరాన్‌పై యుద్ధం విషయంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు చేశారు. అనుకున్న దానికంటే ముందుగానే.. మరికొన్ని వారాల్లో ఆ దేశంపై దాడులు ముగిస్తామన్నారు. టెహ్రాన్‌పై భూతల దాడులు చేయకుండానే తాము అనుకున్న లక్ష్యాలను సాధించగలమని ధీమా వ్యక్తంచేశారు. రాబోయే రెండు వారాల్లో తమ దాడులు పూర్తయ్యేసరికి టెహ్రాన్ చరిత్రలో ఎన్నడూ లేనంత బలహీనంగా మారిపోతుందన్నారు. ఫ్రాన్స్‌లో జీ7 ప్రతినిధులతో సమావేశమైన అనంతరం రూబియో విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్‌లో జరిగే చమురు రవాణాపై ఇరాన్ సుంకాలు విధించకుండా నిరోధించడమే తమ తక్షణ కర్తవ్యమని రూబియో అన్నారు. ఈ సుంకాల వల్ల అనేక దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. యుద్ధం ముగింపుపై చర్చల కోసం ఇరాన్ పాల కవర్గం తమకు పలు సందేశాలు పంపిందని.. అయితే తాము ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై మాత్రం స్పందించలేదని తెలిపారు.

# గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై భారీ దాడులు



టెహ్రాన్, మార్చి 28 : పశ్చిమాసియాలో దాడులు రోజురోజుకు మరింత తీవ్రమవుతున్నాయి. గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు కొనసాగిస్తోంది. తాజాగా సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలపై టెహ్రాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్‌పై జరిగిన దాడిలో అనేకమంది అమెరికా సైనికులు గాయపడగా, యుద్ధ విమానాలు దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాల్లో భారీ పేలుళ్లు సంభవించినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. దేశ రాజధాని రియాద్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లను కూల్చివేసినట్లు సౌదీ అరేబియా రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. టెహ్రాన్ దాడుల్లో కువైట్‌లోని పలు వాణిజ్య భవనాలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఐక్యరాజ్యసమితి అభ్యర్థన మేరకు హర్మూజ్ జలసంధి గుండా మానవతా సాయం, వ్యవసాయ సరకుల రవాణాను అనుమతించడానికి ఇరాన్ అంగీకరించింది.

**ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడి**

సరిగ్గా నెల రోజుల కిందట ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు మొదలుపెట్టిన విషయం తెలిసిందే. ఈ దాడులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. తాజాగా ఇరాన్‌లోని బాలిస్టిక్ క్షిపణులు, ఇతర ఆయుధాలను ఉత్పత్తి చేసే ప్లాంట్లు, క్షిపణి ప్రయోగకేంద్రాలే లక్ష్యంగా దాడులు చేపట్టినట్లు రక్షణ మంత్రి కాట్జ్ పేర్కొన్నారు. తమ దాడుల్లో అణ్వాయుధాల ముడి పదార్థాలను శుద్ధి చేసే కర్మాగారాలు ధ్వంసమయ్యాయని.. ఇది టెహ్రాన్ అణు కార్యక్రమానికి పెద్ద దెబ్బ అని ఇజ్రాయెల్ తెలిపింది. దాడులపై ఇరాన్ స్పందిస్తూ.. టెల్ అవీవ్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది.

Printed, Published & Owned by Kemoju Madhuri, Plot No.32, 3rd Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code:500043, Printed at S.V.Printers, Plot No.32,Ground Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code: 500043, Editor : Kemoju Srinivas, RNI No.TELTEL/2016/68720, e-mail: policenigah@gmail.com. Cell: 9133613813, Off: 040-35668279